సంచలన వార్తలకు

# నేడు

TELUGU DAILY

సోమవారం-28.4.2025 | హైదరాబాద్ సంపుటి -3 సంచిక-1 | పేజీలు -8 వెల: రూ.2

www.nedudailynews.com

## మూడేళ్ల జైలు.. 3లక్షల ఫైన్

న్యూఢిల్లీ : విధించిన గడువులోగా భారత్‌ను విడిచి తిరిగి వెళ్లకుంటే కఠిన చర్యలు ఉంటాయని పాకిస్థానీలను కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ ఆదేశాలు పాటించకుంటే మూడేళ్ల జైలు శిక్షగానీ రూ.3 లక్షల జరిమానాగానీ విధిస్తామని తెలిపింది. లేదంటే రెండు శిక్షలూ విధించే అవకాశం ఉందని తెలిపింది. మెడికల్ వీసాలు ఉన్నవారు మంగళవారంలోగా వెళ్లిపోవాలని ఆదేశించింది. వీసా ఆన్ అరైవల్, బిజినెస్, జర్నలిస్టు వంటి 12 రకాల వీసాలపై వచ్చినవారు ఆదివారం నాటికి, సార్క్ వీసాలు ఉన్నవారు శనివారం నాటికే దేశాన్ని విడిచిపెట్టి వెళ్లాలని ఇంతకుముందే సూచించింది. 'లీవ్ ఇండియా' పేరుతో నోటీసులు పంపించింది.





## తెలంగాణకు

# విలన్ కాంగ్రెస్సే

పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే తెలంగాణను నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చేవరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. రైతుల నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. రైతుకు మేలు చేసిన వాళ్లు లేరు. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని రైతుబంధు పథకం తీసుకువచ్చాను. రైతులు ఆత్మహత్య చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకుంది.

– కేసీఆర్, బీఆర్ఎస్ అధినేత

- నేటి కాంగ్రెస్ పాలనలో తెలంగాణను చూస్తే దుఃఖమొస్తోంది
- ఏడాదిన్నర సమయం ఇచ్చాం..ఇక వెంటపడుతాం
- హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూలగొడుతున్నరు
- గౌరవెల్లి, పాలమూరు ప్రాజెక్టుల్లో తట్టెడు మట్టి తీయలె
- కేంద్రం ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి
- బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్

3

హైదరాబాద్, నేడున్యూస్: ఇప్పటి నుంచి నేను బయటికి వస్తా.. అందరి తరఫున పోరాడుతానని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. ఆనాడు, ఈనాడు, ఏనాడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీనేనని తీవ్రస్థాయిలో విమర్శించారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూనని, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే నిరంకుశంగా అణిచివేసింది కాంగ్రెస్ పార్టీనేనని ధ్వజమెత్తారు. వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆయన కీలక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేసీఆర్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలను ఉద్దేశిస్తూ, బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చిన అందరికీ వందనాలు తెలిపారు. కన్నతల్లిని, జన్మభూమిని మించిన స్వర్గం మరొకటి ఉండదని శ్రీరాముడు ఏనాడో చెప్పారని గుర్తు చేశారు. వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలని భావించానని, వలసవాదుల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు ఒక్కడినే బయలుదేరానని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ కోసం నేను బయలుదేరిన నాడు కొందరు వెటకారం చేశారన్నారు.

### నకిలీ గాంధీల హామీలు ఎన్నో

కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారని, ఢిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలు ఇచ్చారని కేసీఆర్ విమర్శించారు. పింఛను రూ.2 వేలు ఉంటే రూ.4వేలు ఇస్తామన్నారు, మేం రైతుబంధు రూ.10 వేలు ఇస్తే రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారని ఆరోపించారు. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు, రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందన్నారు. ధాన్యం తడిసినా, మొలకలు వచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసేదని గుర్తు చేశారు.



3

## కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నారు

- కేసీఆర్ కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేశారు: మంత్రి పొంగులేటి
- నియంతలా కేసీఆర్ తీరు: సీతక్క
- ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది ఎవరు: జూపల్లి

హైదరాబాద్, నేడున్యూస్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మనసంతా విషం తో నిండిపోయిందని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో సాగిన ఆయన ప్రసంగం మొత్తం లో కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప, ఇంకేమీ లేదని అన్నారు. మంచి సలహాలు, సూచనలు ఇస్తారేమోనని కేసీఆర్ ప్రసంగం విన్నామని, అందులో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా ఎల్కతుర్తిలో కేసీఆర్ చేసిన ప్రసంగంపై ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తీరును తప్పుబట్టారు. 'గత సీఎం పరిపాలన వల్లే ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. అప్పులున్నా.. ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? కడుపంతా విషం నింపుకొని

## కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు నియామకం
- ఈనెల 30న పదవి విరమణ చేయనున్న ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి

3




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి రామకృష్ణారావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న ఆయన రానున్న ఆగస్టులో రిటైర్ కానున్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత కీలక భాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి ఈనెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. ఆమె రిటైర్మెంట్ అనంతరం సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టనున్నారు.

## కర్రెగుట్టలో భారీ సొరంగం

- ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో ఆరోరోజూ ఆపరేషన్
- అన్నివైపుల నుంచి చుట్టుముట్టిన భద్రతా బలగాలు
- కర్రెగుట్టల్లో భారీ సొరంగం గుర్తించిన భద్రతా బలగాలు

3

హైదరాబాద్, నేడున్యూస్: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ బోర్డర్ కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల కోసం భద్రతా దళాల వేట కొనసాగుతోంది. నక్సల్స్ కోసం ఇక్కడి అడవుల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కర్రెగుట్టలను అన్నివైపుల నుంచి భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఈ క్రమంలో భారీ సొరంగాన్ని గుర్తించాయి. వెయ్యి మంది తలదాచుకునేందుకు వీలుగా సొరంగ నిర్మాణం ఉంది. కర్రెగుట్టలోని సొరంగం లోపల పెద్ద మైదానంతో విశాలంగా ఉన్న సొరంగాన్ని గుర్తించారు. ఇందులో నీటి వసతి, ఇతర సౌకర్యాలున్నట్లుగా తెలుస్తోంది. కొన్ని నెలల పాటు నక్సల్స్ ఈ సొరంగంలోనే తలదాచుకున్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి.



## న్యాయం జరుగుతుంది

### ఉగ్రదాడి కారకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు: ప్రధాని

హైదరాబాద్, నేడున్యూస్: పహల్గాం ఉగ్రదాడి బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. 26 మంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నవారందరూ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉగ్రదాడి తనను ఎంతగానో కలచివేసిందని, ప్రతి భారతీయుడు కోపంతో రగిలిపోతున్నాడని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమయ్యే మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ,

3



## బైక్‌ను ఢీకొట్టి బావిలో పడ్డ కారు

### 11మంది మృతి

3

మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకెళ్తున్న వ్యాన్ ఒక బైక్‌ను ఢీకొట్టాక అదుపు తప్పి బావిలో పడిపోయింది.



## పహల్గాం ఉగ్రదాడిపై అంతర్జాతీయ దర్యాప్తు

### రష్యా, చైనాల జోక్యం కోరుకుంటున్న పాక్!

జమ్ముకశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై దర్యాప్తులో రష్యా, చైనాలు జోక్యం చేసుకోవాలని పాకిస్తాన్ కోరుకుంటోందని తెలుస్తోంది. తాజాగా రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ 'ఆర్ఐఏ నోవోస్తీ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పాకిస్థాన్ రక్షణమ్మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఈ మేరకు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించిన విచారణలో రష్యా, చైనా, ఏవైనా పశ్చిమ దేశాలు భాగమైతే బాగుంటుందని మేం భావిస్తున్నాం. ఆయా దేశాలన్నీ కలిసి ప్రత్యేక దర్యాప్తు టీమ్‌ను ఏర్పాటు చేయొచ్చు. మోదీ (భారత్) నిజం చెబుతున్నారా- అబద్ధమా అనేది నిగ్గుతేల్చాలి'' అని ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు.పహల్గాం ఉగ్రదాడిపై అంతర్జాతీయ స్థాయి దర్యాప్తు చేయించేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా ప్రతిపాదించారు అని ఆయన పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యులు ఎవరో గుర్తిద్దాం కుట్రదారులు ఎవరో గుర్తిద్దాం. ఒట్టి మాటలతో, పనికి రాని వ్యాఖ్యలతో ఫలితమేం ఉండదు. ఆ దాడిలో పాకిస్థాన్ ప్రత్యక్ష పాత్రను నిరూపించే ఆధారం బయటికి రావాలి లేదా పాకిస్థాన్ మద్దతు కలిగిన వారి పాత్ర ఉన్నా వివరాలు బయటకురావాలి. ప్రస్తుతం జరుగుతున్నది వ్యాఖ్యానాల పర్వం. దానితో ఒరిగేదేం లేదు అని పాకిస్థాన్ రక్షణమంత్రి తెలిపారు.

పాక్‌లో ఆ ఇద్దరి సంచలన వ్యాఖ్యలు : ఆండ్రూ కోరిబ్కో

ఈ అంశంపై మాస్కో(రష్యా)లో ఉంటున్న అమెరికాకు చెందిన విదేశాంగ వ్యవహారాల నిపుణుడు ఆండ్రూ కోరిబ్కో భిన్నమైన విశ్లేషణ చేశారు. పహల్గాం ఉగ్రదాడి విషయంలో భారత్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ ఖండించింది. ఇది అందరూ ఊహించిన పరిణామమే. అయితే పాకిస్థాన్‌లో పెద్ద స్థానాల్లో ఉన్న ఇద్దరు వ్యక్తులు మాత్రం స్వదేశం పరపతిని దెబ్బతీసేలా మాట్లాడారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన వారు బహుశా స్వాతంత్ర్య సమరయోధులై ఉండొచ్చు అని పాకిస్థాన్ డిప్యూటీ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ వ్యాఖ్యానించారని ఆండ్రూ కోరిబ్కో గుర్తు చేశారు.

పాకిస్థాన్‌కు చెడ్డపేరు తేవాలనే దురుద్దేశంతో ఎవరైనా ఇతరులు పహల్గాం ఉగ్రదాడిని చేయ్యించి ఉండొచ్చని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు అని కోరిబ్కో తెలిపారు. ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని సమర్థించేలా ఇషాక్ దర్ మాట్లాడారు. ఉగ్రవాదాన్ని, టూరిస్టుల ఊచకోతను, మతం ప్రాతిపదికన ప్రజల ప్రాణాలు తీయడాన్ని ఎవ్వరైనా ఖండించాల్సిందే. అందులో సమర్థింపులకు అస్సలు తావే లేదు అని కోరిబ్కో విశ్లేషించారు. ఇక రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారహితంగా, పట్టింపు లేని ధోరణిని బయటపెట్టేలా ఉన్నాయన్నారు.

ఇదంతా చూస్తుంటే- పాకిస్థాన్‌లోని ఓ వర్గం తమ తప్పును గుడ్డిగా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈవిషయంలో పాక్ ప్రభుత్వంలోని నేతల అభిప్రాయాల్లోనూ వైరుధ్యాలు ఉన్నట్లు క్లియర్ అవుతోంది. అందుకే ఎవరికి వారుగా చెరొక వాదనను తెరపైకి తెచ్చారు అని ఆండ్రూ కోరిబ్కో విశ్లేషించారు. ఈ మేరకు వివరాలతో సబ్‌స్టాక్ అనే ఆన్‌లైన్ వార్తా వేదికకు ఆయన వ్యాసం రాశారు.

తామే దాడి చేశామన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్

పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది తామేనని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ కశ్మీర్ విభాగం 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) ఇప్పటికే ప్రకటించింది. ఈ దాడికి పాల్పడిన వారితో పాటు కుట్రదారులను వదిలిపెట్టేది లేదని ఆదివారం మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో భారత ప్రధాని మోదీ వార్నింగ్ ఇచ్చారు.

## రష్యాకు యుద్ధం ఆపే ఉద్దేశం లేదనుకుంటా!

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు యుద్ధం ఆపాలన్న ఉద్దేశం లేనట్లు కనిపిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. పోప్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన ట్రంప్, జెలెన్‌స్కీలు సెయింట్ పీటర్స్ బసిలికా చర్చిలో సమావేశ తర్వాత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని పుతిన్ పేర్కొన్నారు.

అంతకుముందు యుద్ధం ముగించేందుకు చర్చల కోసం ప్రయత్నాలు జరుపుతున్న వేళ ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులకు పాల్పడుతుండటంపై డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా పౌర ప్రాంతాలపై ఎలాంటి కారణం లేకుండా పుతిన్ క్షిపణులతో దాడి చేస్తున్నారు. ఇది చూస్తే, ఆయనకు యుద్ధంగా ఆపే ఉద్దేశం లేదని అనిపిస్తోందన్నారు. ఆయనతో కాస్త భిన్నంగా వ్యవహరించాలని, బ్యాంకింగ్ లేదా ఇతర ఆంక్షలపై ఆలోచించక తప్పదన్నారు. దాదాపు 15 నిమిషాల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయిన తర్వాత సొంత సోషల్ మీడియా వేదికపై ట్రంప్ ఈ మేరకు స్పందించారు. ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు ఆపాలని, ఇప్పటికైనా శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని పుతిన్‌కు సూచించారు.

చర్చల విషయంలో కొన్ని గంటల్లోనే పుతిన్ నుంచి సానుకూల స్పందన వచ్చింది. ముందస్తు షరతులు లేకుండానే ఉక్రెయిన్‌తో చర్యలకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా పర్యటనలో ఉన్న అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కోఫ్‌తో ఈ విషయాన్ని పేర్కొన్నట్లు క్రెమ్లిన్ వర్గాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌తో చర్చలకు సంబంధించిన విషయాన్ని పుతిన్ అనేకసార్లు స్పష్టం చేశారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు.

అయితే, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తోనూ ట్రంప్, జెలెన్‌స్కీ చర్చలు జరిపారు. సరిగ్గా ఈ సమావేశాలకు ముందు ఉక్రెయిన్ ఆక్రమించిన కర్స్క్ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నామని మాస్కోలో పుతిన్ కీలక ప్రకటన చేశారు. కీవ్ దురాక్రమణ పూర్తిగా విఫలమైందని పుతిన్ ప్రకటించారు. అంతేకాదు, ఈ విజయంలో ఉత్తరకొరియా సైన్యమూ కీలక పాత్ర పోషించిందని రష్యా వెల్లడించింది. ఉత్తర కొరియా సైనికులు రష్యాకు మద్దతుగా యుద్ధంలో నేరుగా పాల్గొంటున్నారని గత కొన్నాళ్లుగా ఉక్రెయిన్ ఆరోపిస్తూ వస్తోంది. దీనిపై పుతిన్ సైన్యం ఎప్పుడూ స్పందించలేదు. తొలిసారి శనివారం ఆ దేశ సైన్యాధ్యక్షుడు వేలరీ గెరిస్మోవ్ ఈ విషయాన్ని అంగీకరించారు.

# ఎన్ఐఏకు పహల్గాం కేసు

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఇ టీవల జరిగిన ఘోర ఉగ్ర దాడి కేసు దర్యాప్తు బా ధ్యతలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) స్వీకరించింది. ఈ దాడిలో ఒక నేపాల్ జాతీయునితో సహా మొత్తం 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ కేసును ఎన్ఐఎకి బదలీ చేసినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఇప్పటి వరకు ఈ కేసు దర్యాప్తును జమ్మూ కాశ్మీర్ పోలీసులు పర్యవేక్షించారు. అయితే, ఘటన తీవ్రత దృ ష్టా కేంద్ర ప్రభుత్వం దీనిని ఎన్ఐఎకి అప్పగించాలని నిర్ణయించింది. ఎన్ఐఎకి కేసు అప్పగించడం తో జమ్మూ కశ్మీర్‌లో అధికారికంగా దర్యాప్తు సం స్థ పహల్‌గామ్ ఘటనపై కేసు నమోదు చేసింది. దాడి జరిగిన మరునాడు ఈ నెల 23 నుంచే ఎన్ఐఎ బృందాలు పహల్‌గామ్‌లోని ఘటన స్థలంలో మోహరించాయి. ఐజి, డిఐజి, ఎస్‌పి స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఈ బృందాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

సుందర పర్యాటక ప్రదేశం బైసరన్ లోయలో ఈ నెల 22న ఈ భయానక దా డిని ప్రత్యక్షంగా చూసిన సాక్షులను ఎన్ఐఎ అధికారులు క్షుణ్ణంగా విచారిస్తున్నారు. సంఘటన జ రిగిన తీరును, ఉగ్రవాదుల కదలికలను కూలంకషంగా అడిగి తెలుసుకుంటున్నారు. ఉగ్రవాదులు ఘటన స్థలానికి ఎలా చేరుకున్నారు, దాడి తరువా త ఎలా తప్పించుకున్నారు అనే కోణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఎన్ఐఎ బృందాలు నిశితం గా పరిశీలిస్తున్నాయి. ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో ఘటన స్థలంలో లభించే చిన్న ఆధారాన్నీ జాగ్రత్తగా



సేకరిస్తున్నారు. ఈ దాడికి పాల్పడిన ఉ గ్రవాదులను పట్టుకునేందుకు భద్రత బలగాలు ఇ ప్పటికే కాశ్మీర్ లోయలో గాలింపు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా గతం లో ప్రకటించిన పది మంది ఉగ్రవాదులకు చెందిన ఇళ్లను అధికారులు కూల్చివేశారు.

పహల్‌గామ్ దాడికి సంబంధించి దర్యాప్తు సంస్థల కు కీలక వీడియో ఒకటి లభ్యమైంది. పర్యాటకుల కు రీల్స్, వీడియోలు చిత్రీకరించే ఓ వీడియోగ్రాఫ ర్ తీసిన దాడికి సంబంధించిన క్లిప్పింగులు దర్యాప్తునకు కీలకంగా మారనున్నాయి. వీడియో గ్రాఫ ర్ ఉగ్రవాదుల మారణకాండను మొత్తం ఓ చెట్టుపై నక్కి పూర్తిగా చిత్రీకరించాడు. దాన్ని ఎన్ఐఎ సంపాదించింది. ఉగ్రవాదులు రెండు గ్రూపులుగా వీడిపోయి దారుణానికి పాల్పడినట్లు వీడియోను బట్టి స్పష్టమైంది. తొలుత ఇద్దరు ఉగ్రవాదులు పలువుని పట్టుకుని ముస్లిం మతాచారాన్ని అనుసరించాలని ఆదేశించినట్లు, పాటించని నలుగురిని అక్కడికక్కడే కాల్చి చంపినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

## న్యాయం జరుగుతుంది

ఈ మేరకు పహల్గాం ఉగ్రదాడి బాధితులకు భరోసా ఇచ్చారు. దేశంలో ఎన్నో మతాలు, కులాలు, భాషలు ఉన్నప్పటికీ, ప్రజలంతా బాధితులకు అండగా నిలిచారని, ఇదే భారత్‌లో ఉన్న గొప్పదనమని కీర్తించారు. ఉగ్రవాదంపై పోరాటం, దేశ ప్రజల ఐక్యత, 140కోట్ల మంది ప్రజల సంఘీభావం దేశానికి అతిపెద్ద బలమన్నారు. మనలో ఉన్న ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని దేశ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. ఈ దాడిని భారత ప్రజలు ఒకే గొంతుతో వ్యతిరేకించడాన్ని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని మరోసారి కృతజ్ఞతలు చెప్పారు. దేశంలో ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయాల్సిన సమయం వచ్చిందని మోదీ వెల్లడించారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వారిని బయటకు లాగుతామని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నవారి వెన్ను విరుస్తామని వార్నింగ్ ఇచ్చారు.

## భారత్ పొరుగువారికి హాని చేయదు

న్యూఢిల్లీ : భారత్ తన పొరుగున ఉన్న దేశాలకు ఎప్పటికీ హాని తలపెట్టదని, అయితే ఎవరైనా భారత్‌కు హాని చేస్తే మాత్రం వారికి దీటుగా సమాధానం చెప్పడం తప్ప వేరే మార్గం లేదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పహల్గాం ఉగ్రదాడిపై స్పం దించారు. 'సనాతన ధర్మం సత్యం, స్వచ్ఛత, కరుణ, ఆధ్యాత్మిక క్రమశిక్షణ వంటి నాలుగు స్తంభాలపై నిల బడింది.

కొన్ని సందర్భాల్లో దురాక్రమణదారుల చేతిలో పరాజయం పాలవకుండా ఉండటం మన విధి. ఇది సనాతన హిందూ ధర్మంలో ఒక ముఖ్య నియమం. దీనిలోని అహింసా సూత్రాలు ప్రజలను ఆలోచింపజేస్తాయి. ఈ సూత్రాలు నచ్చే ఎంతో మంది వీటిని హృదయపూర్వకంగా స్వీకరించారు. అయితే కొంత మంది మాత్రం వీటి ని అంగీకరించకుండా ఇబ్బందులు కలిగిస్తున్నారు. ప్రజల భద్రత కోసం రాజు తన కర్తవ్యాన్ని తప్పక నిర్వర్తిస్తాడు' అని పేర్కొన్నారు.

# ఎప్పుడైనా, ఎక్కడైనా రెడీ

పహల్గాం ఘటన నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఇండియన్ నేవీ సిద్ధమవుతోంది. అందులో భాగంగా అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. ఈ విషయాన్ని సమాజిక మధ్యమం ద్వారా ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన నేపథ్యంలో సన్నద్ధతను పరీక్షించుకునేందుకు వీటిని ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎప్పుడైనా- ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు ఇండియన్ నేవీ రెడీ అని ప్రకటించింది.

ఇటీవల భారత్ అరేబియా సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్(ఎంఆర్-ఎస్ఏఎం) తో సీ స్కిమ్మింగ్ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. ఈ మేరకు నౌకాదళం వీడియోను విడుదల చేసింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు తెలిపింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో ప్రయాణించే డ్రోన్లు, క్షిపణులు వంటి వాటిని సీ స్కిమ్మింగ్ టార్గెట్‌లుగా పరిగణిస్తారు.



# కొనసాగుతున్న ఇళ్ల కూల్చివేత

అనంతనాగ్: పహల్గాం ఉగ్రదాడితో సంబంధం ఉందని భావిస్తున్న ఉగ్రవాదుల ఇండ్ల కూల్చివేత కొనసాగుతోంది. లష్కరే తోయి బా ముఠాతో సంబంధం ఉన్న ఉగ్రవాదులు, అనుమానితుల ఇండ్లను ధ్వంసం చేస్తూనే ఉన్నారు. ఆదివారం కూడా ఉగ్రసంస్థలతో సంబంధాలున్నాయని భావిస్తున్న పలువురి ఇండ్లను కూల్చేశారు.

దీంతో ఇప్పటివరకు కూల్చివేతలో ఇండ్లు కోల్పోయిన వారి సంఖ్య 9కి చేరింది. ఈ తొమ్మిది మంది మాత్రమే కాదు.. మిగతా ఉగ్రవాదులపై కూడా ఇలాంటి చర్యలే తీసుకుంటా మని అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రస్థావరాలను గుర్తించేందుకు 60కి పైగా ప్రాంతా ల్లో అధికా రులు దాడులు నిర్వహించారు. ఉగ్రవాదు ల కోసం భద్రతాబలగాలు ముమ్మర ంగా గాలిస్తున్నాయి.

22 గంటల ట్రెక్కింగ్

పహల్గాం దాడికి పాల్పడేందుకు ఉగ్రవాదులు దాదాపు 22 గంటల పాటు ట్రెక్కింగ్ చేసినట్టు దర్యాప్తులో తేలిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఐడీ కార్డులు చూసి మరీ హిందువులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు మారణకాండకు పాల్పడ్డారు. కాల్పులు జరిపిన బైసరన్ లోయకు వారంతా కాలినడకన వచ్చారని తెలుస్తోంది. మొత్తం నలుగురు ఉగ్రవాదులు కాల్పులు జరపగా.. వారిలో ముగ్గురు విదేశీ ఉగ్రవాదులు కాగా.. మరొకరు స్థానిక ఉగ్రవాది అని అధికారులు తెలిపారు. ఆదిల్ థోకర్ అనే స్థానిక ఉగ్రవాది దాడిలో పాల్గొన్నట్టు తేల్చారు.

ఎన్ఐఏ చేతికి..

పహల్గాం ఉగ్రదాడి కేసును కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది. దీంతో ఎన్ఐఏకు చెందిన బృందాలు పహల్గాంలో విచారణను ప్రారంభించాయి. ఉగ్రదాడి జరిగిన సమయంలో ముష్కరులను చూసిన ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను ఉగ్రవాద నిరోధక సంస్థకు చెందిన పోలీస్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఎన్ఐఏ అధికారు లు విచారించారు. అంతకు ముందు ఈ కేసును భద్రతా బలగాలు, జమ్మూకశ్మీర్ పోలీసులు విచారించారు.

# 130 అణుబాంబులు సిద్ధం

భారత్‌పై పాకిస్థాన్ రాజకీయ నేతల కారు కూతలు కొనసాగుతున్నాయి. భారత్‌పై దాడి చేసేందుకే 130 అణుబాంబులు సిద్ధంగా ఉంచినట్లు పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ పిచ్చి ప్రేలాపనలు చేశారు. భారత్‌పై దాడులకు తమ వద్ద అధునాతన ఘోరీ, షహీన్, ఘజ్నవి వంటి క్షిపణులు కూడా ఉన్నాయని బెదిరింపులకు దిగారు. భారత్ సింధూ జలాలను నిలిపివేస్తే పూర్తి స్థాయి యుద్ధానికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. పాక్ వద్ద ఉన్న అణ్వాయుధాలు దేశంలోని వివిధ రహస్య ప్రాంతాల్లో భద్రపర్చామని, భారత్ కవ్విస్తే దాడికి సిద్ధంగా ఉన్నట్లు అబ్బాసీ వెల్లడించారు. తమ వద్ద ఉన్న ఆయుధాలు, క్షిపణులు ప్రదర్శన కోసం కాదనీ, తమ అణ్వాయుధాలను ఎక్కడ ఉంచామో ఎవరికీ తెలియదని అబ్బాసీ అన్నారు.

రెండ్రోజులు గగనతలం మూసేస్తేనే భారత వైమానిక రంగం తీవ్ర గందరగోళంలో కూరుకుపోయిందనీ, మరో 10 రోజులు ఇలా చేస్తే భారత విమానయాన సంస్థలు దివాలా తీస్తాయని మంత్రి అబ్బాసీ అన్నారు. పాకిస్థాన్ నుంచి ఎదురుకానున్న తీవ్ర పరిణామాలను న్యూదిల్లీ ఇప్పటికే అర్థం చేసుకుంటోందని అబ్బాసీ అన్నారు. అంతేకాకుండా ఇబ్బందులు ఎదుర్కోవడానికి తామూ సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు.

మరో ఇద్దరు మంత్రులదీ అదే తీరు

అంతకుముందు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసీఫ్, విదేశాంగ మంత్రి భుట్టో ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు, ఉగ్రసంస్థలకు ఆర్థిక సహకారం వంటి చెత్త పనులన్నీ పశ్చిమదేశాల కోసం చేశామని ఖ్వాజా ఆసీఫ్ అంగీకరించారు. ఇది పొరపాటేనని, అందుకు ఫలితంగానే తమ దేశం ఇబ్బందులకు గురవుతోందని తెలిపారు. జమ్ముకశ్మీర్ పహల్గాంలోని బైసరన్‌లో ఉగ్రదాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై ఖ్వాజా ఆసిఫ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో తాము చేరకపోయి ఉంటే పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేదన్నారు. కాగా, ఇప్పటికే సింధూ జలాలను నిలిపివేస్తే ఆ నదిలో భారతీయుల రక్తం పారుతుందని భుట్టో నోరుపారేసుకున్నాడు. మరోవైపు లండన్‌లోని పాక్ హైకమిషన్ వద్ద ఓ పాక్ అధికారి, నిరసన చేస్తున్న భారతీయులను గొంతు కోస్తా అని సంజ్ఞలు చేశాడు.



## బైక్‌ను ఢీకొట్టి బావిలో పడ్డ కారు

ఆదివారం నారాయణ్ ఘర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కచారియా గ్రామంలో జరిగిన ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తితో పాటు బావిలో పడ్డ వారిని రెస్క్యూ చేయబోయిన వ్యక్తి కూడా చనిపోయారు.

రత్లాం రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) మనోజ్ సింగ్ కథనం ప్రకారం, రత్లాం జిల్లా తాల్‌కు చెందిన 13 మంది మంద్ సౌర్ జిల్లా అంతారి మాతాజీ గ్రామంలో ఉన్న మాతా మందిరం సందర్శనకు వ్యాన్‌లో బయలుదేరారు. కచారియా గ్రామంలోని చౌపట్టి వద్దకు చేరుకోగానే ఆ వ్యాన్‌పై డ్రైవర్ అదుపు కోల్పోయాడు. దీంతో వ్యాన్ అదుపు తప్పి ఓ బైక్‌ను ఢీకొట్టి, నేరుగా వెళ్లి బావిలో పడిపోయింది. వ్యాన్ వేగంగా ఢీకొనగానే బైక్ నడుపుతున్న వ్యక్తి చనిపోయాడు. ఇక బావిలో వ్యాన్ పడటాన్ని చూసిన స్థానికుడు మనోహర్ సాహసం చేసి బావిలోకి దూకాడు. వ్యాన్‌లోని వారిని కాపాడేందుకు యత్నించాడు. అయితే అతడు కూడా బావి నీటిలో మునిగి చనిపోయాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే మల్హార్‌గఢ్ ఎస్‌డీఓపీ నరేంద్ర సోలంకి, అదనపు ఎస్పీ గౌతమ్ సోలంకి సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు.

13 మందిలో తొమ్మిది మంది బలి

ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని మొత్తం 13 మందిలో నలుగురిని రక్షించగా, తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. బావిలో నుంచి అన్ని మృతదేహాలను వెలికి తీశారు. మరొక మృతదేహాన్ని బయటికి తీసేందుకు రెస్క్యూ వర్క్ కొనసాగుతోంది. "మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం జిల్లా ఆస్పత్రికి పంపాం. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం అదే ఆస్పత్రికి తరలించాం అని మల్హార్‌గఢ్ ఎస్‌డీఓపీ నరేంద్ర సోలంకి వెల్లడించారు. గాయపడిన వారికి ప్రస్తుతం మా ఆస్పత్రిలో చికిత్స జరుగుతోంది అని జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ డీకే శర్మ తెలిపారు. సహాయక చర్యల్లో జాతీయ విపత్తు స్పందన దళం (NDRF)తో పాటు ఇతరత్రా భద్రతా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం, మల్హార్‌గఢ్ ఎమ్మెల్యే జగదీశ్ దేవ్డా ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. వ్యాన్‌పై డ్రైవర్ అకస్మాత్తుగా అదుపు కోల్పోయినందు వల్లే ఈ ప్రమాదం జరిగింది. దీనిపై విచారణకు ఆదేశాలు జారీ చేశాం. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సహాయం అందిస్తాం. మృతుల అంత్యక్రియల కోసం కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తాం అని డిప్యూటీ సీఎం వెల్లడించారు.

మేం ఒక వివాహ వేడుకలో పాల్గొనడానికి రత్లాం జిల్లాకు వచ్చాం. ఆ తర్వాత దైవదర్శనం కోసం వ్యాన్‌లో అంతారి మాతాజీ గ్రామానికి బయలుదేరాం. అక్కడికి వెళ్తుండగా కచారియా గ్రామం సమీపంలో ప్రమాదం జరిగింది. వ్యాన్ బావిలో పడగానే మేమంతా స్పృహ కోల్పోయాం" అని ఈ ప్రమాదంలో గాయపడిన గుడ్డి బాయి అనే మహిళ వివరించింది.



## తమిళనాడు మంత్రులు సెంథిల్ బాలాజీ, పొన్ముడి రాజీనామాలు

ఎం.ఎల్.స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం నుండి తమిళనాడు మంత్రులు వి.సెంథిల్ బాలాజీ, కె. పొన్ముడి రాజీనామా చేశారని, గవర్నర్ దానిని ఆమోదించారని రాజ్‌భవన్ ఆదివారం తెలిపింది. వారి రాజీనామాలను ఆమోదించాలని ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ చేసిన సిఫార్సును గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆమోదించారని రాజ్‌భవన్ ప్రకటన పేర్కొంది. సెంథిల్ బాలాజీ ఈడి దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. 'పదవా లేక స్వేచ్ఛా ఏదో ఒకటి ఎంచుకొండి' అంటూ సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. ఒఇక ఒక సెక్స్ వర్కర్ విషయంలో పొన్ముడి చేసిన శైవ వైష్ణవ వ్యాఖ్యలపై పెద్ద దుమారమే రేగింది. దీనిపై మద్రాస్ హైకోర్టు తర్వాత స్వయంగా విచారణ ప్రారంభించింది. ఆయనను పార్టీ కీలక పదవి నుంచి తొలగించినప్పటికీ, ప్రతిపక్ష పార్టీలు, ఇతర వర్గాల నుండి ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలనే డిమాండ్లు వచ్చాయి. ఇదివరలో సెంథిల్ బాలాజీ నిర్వహించిన ఎలక్ట్రిసిటీ శాఖను ఇకపై ట్రాన్స్‌పోర్ట్ మంత్రి ఎస్.ఎస్. శివశంకర్ నిర్వహిస్తారు. కాగా సెంథిల్ బాలాజీ నిర్వహించిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖను హౌజింగ్ మినిష్టర్ ఎస్.ముతుస్వామికి అప్పగించారు. మరోవైపు పొన్ముడి నిర్వహించిన అటవీ శాఖను పాడిపరిశ్రమ మంత్రి ఆర్.ఎస్.రాజకన్నప్పన్‌కు కేటాయించారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే పద్మనాభపురం ఎంఎల్ఎ టి.మనో తంగరాజ్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన సిఫార్సును కూడా గవర్నర్ రవి ఆమోదించారు.

# కర్రెగుట్టలో భారీ సొరంగం

అన్ని కొండలను చుట్టుముట్టడం : కర్రెగుట్టలో పెద్ద సంఖ్యలో ఉన్న మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్‌కు గురయ్యారని, వారి పరిస్థితి మరింత విషమంగా మారుతోందని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు నిరంతరం జరుగుతున్న ఈ ఆపరేషన్ కారణంగా మావోయిస్టులు ప్రస్తుతం ఆహారం కోసం ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. నక్సల్స్ దాక్కున్న అన్ని కొండలను చుట్టుముట్టే వరకు ఈ ఆపరేషన్‌ను కొనసాగించాలని ప్రభుత్వం, భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

జల్లెడ పడుతూ కొండలపైకి : ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దును కేంద్రంగా చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, పూజారికాంకేర్, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గంలో ప్రధానంగా ఆపరేషన్ జరుగుతోంది. రుద్రారం వరకు 90 కిలో మీటర్ల పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో భద్రతా బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి.

ముగ్గురి మృతదేహాలు లభ్యం : అతి కష్టం మీద శనివారం(ఏప్రిల్ 26) సాయంత్రం కొంతమేరకు ఎక్కగలిగిన బలగాలు మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న భారీ సొరంగాన్ని గుర్తించాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా నక్సల్స్ మృతదేహాలను, పెద్దఎత్తున పేలుడు సామగ్రి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. శనివారం భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందినట్లుగా విస్తృత ప్రచారం జరిగినప్పటికీ అధికారులు మాత్రం అధికారికంగా నిర్ధరించలేదు.

# కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు

తెలంగాణకు కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియమితులయ్యారు. సీనియర్ ఐఏఎస్ అధికారి రామకృష్ణారావును సీఎస్‌గా నియమిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా రామకృష్ణారావు వ్యవహరిస్తున్నారు. కాగా, ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి పదవీ కాలం ఈనెలాఖరు నాటికి పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో కొత్త సీఎస్‌గా రామకృష్ణారావును నియమించారు.

1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన రామకృష్ణారావు.. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత నుంచి ఆర్థిక శాఖలో కీలక భాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన ఆగస్టులో రిటైర్ కానున్నారు. ప్రస్తుత ఐఏఎస్‌లలో సీనియర్‌గా ఉన్న రామకృష్ణారావు.. ఆర్థిక పరిపాలనలో తన అనుభవంతో రాష్ట్రానికి సేవలందించారారు. అందుకే సీఎస్ పదవికి ఆయన్ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఆయన నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు కలెక్టర్‌గా సేవలందించారు.

ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న శాంతి కుమారి 1989 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2023 జనవరి 11న ఆమె తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. రిటైర్మెంట్ అనంతరం శాంతి కుమారిని చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆమె నియామకం ఇప్పటికే ఖరారైనట్లు తెలిసింది. త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు తెలిసింది.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు.. తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులు భారీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. స్మితా సబర్వాల్‌ను ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీగా, శశాంక్ గోయెల్‌ను గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. ఆర్వీ కర్ణన్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా, ఎస్. వెంకటాద్రి యాదగిరిగుట్ట ఈవోగా నియమితులయ్యారు. దాన కిషోర్ కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, శశాంక ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. జెన్‌కో సీఎండీగా హరీష్, హెల్త్ డైరెక్టర్‌గా సంగీత సత్యనారాయణ, పరిశ్రమలు, పెట్టుబడుల సీఈవోగా జయేశ్ రంజన్, హెచ్ఎండీఏ సెక్రటరీగా ఇలంబర్తిలు నియమితులయ్యారు.

# దక్షిణాది అన్ని రాష్ట్రాల్లో జెండా ఎగరేస్తాం



హైదరాబాద్: దక్షిణాది ప్రజలకు బీజేపీ మేలు చేస్తోందని.. తద్వారా వారి హృదయాల్లో చోటు సంపాదించి, ఇక్కడ కూడా జెండా ఎగరేస్తామని కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని భరోసానిచ్చారు.

విజయవా డలో ఆదివారం జరిగిన అంబేద్కర్ 135వ జయంత్యోత్సవాల్లో భాగంగా మేధావుల సదస్సులో పాల్గొన్న కిషన్‌రెడ్డి, ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం మేధావుల సదస్సులో ప్రసంగిస్తూ స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర వహించి, రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ ఎంపీగా పోటీ చేస్తే, ఆయన్ను ఓడించాలని నెహ్రూ విస్తృతంగా ప్రచారం చేశారని, అదీ కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని విమర్శించారు.

కాంగ్రె స్ ప్రచారాన్ని తిప్పి కొట్టి పార్లమెంట్ కు పంపించేలా మేధావులు కీలకపాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కాంగ్రెస్ వ్యవహారించిందని వాపోయారు. అధికారాన్ని నిలుపుకోవడం కోసం కాంగ్రె స్ పార్టీ రాజ్యాంగాన్ని అనుకూలంగా మార్చుకుందన్నారు. మొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన అంబేద్కర్ రాజీనామా చేసేలా కాంగ్రెస్ వ్యవహరించిందన్నారు.అం బేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. రాజ్యాంగాన్ని మరింత శక్తిమంతంగా ఉండాలని మోదీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. దేశానికి సేవ చేసిన అంబేద్కర్‌కు కాంగ్రెస్ భారతరత్న ఇవ్వకుండా అవమానించిదన్నారు.

# తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే



రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశా రు. తెలంగాణలో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్నిరంగాల్లో ఫెయిల్ అయ్యిందని, అయినా ఇంతకాలం వేచి చూశామని, ఇక వెంట పడతామని హెచ్చరించారు. అవినీతి, దోచుకోవడం.. బ్యాగుల్లో దాచుకోవడంలో మాత్రం పాస్ అయ్యారని మండిపడ్డారు.

పోలీసులపై కూడా కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'మీకు రాజకీయాలు ఎందుకు?' అని ప్రశ్నించారు. మీరు డైరీలో రాసుకోండి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఘనంగా జరిగింది. పార్టీ ఆశించిన మేరకు ప్రజలు లక్షలాదిగా హాజరయ్యారు. సుదీర్ఘ విరామం తర్వాత బహిరంగ సభ ద్వారా ప్రజల్లోకి వచ్చిన కేసీఆర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచారు.

సభావేదికపైకి ఆయన చేరుకున్న తర్వాత పార్టీ నేతలు, నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేశారు. ముందుగా కేసీఆర్ పహల్గాం మృతులకు రెండునిమిషాల పాటు మౌనం వహించాలని అందరినీ కోరగా..సభాప్రాంగణంలోని అందరూ నివాళి అర్పించారు. ఆ తర్వాత మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్వాగతోపన్యాసం చేసి కేసీఆర్‌ను ప్రసంగించా ల్సిందిగా ఆహ్వానించారు.

'జననీ జన్మభూమిశ్చ, స్వర్గదపిగరీయసి..'అంటూ తన ప్రసంగాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను టీఆర్ఎస్ పెట్టే నాటికి గందరగోళ స్థితి ఉందని, తెలంగాణ వలసవాద గుప్పిట్లో చిక్కిందనీ, తాను ఒక్కడినే బయలుదేరినట్లు చెప్పారు.

స్వరాష్ట్రం కోసం 25ఏళ్ల నాడు గులాబీ జెండా ఎగురవేసినట్లు తెలిపారు. రాణి రుద్రమ ఏలిన గడ్డ, సమ్మక్క సారలమ్మ పోరాట భూమి, బమ్మెర పోతనలాంటి ఎందరో మహానుభావుల జన్మభూమి వరంగల్ అని అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్న అని చెప్పారు.

టీఆర్ఎస్ ఏర్పాటే సంచలన విజయాలతో మొదలైందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు. గోదావరి, కృష్ణా నీళ్లలో తెలంగాణ వాటా కోసం పోరాడమని, టీఆర్ఎస్ పోరాడితే కాంగ్రెస్ నేతలు పదవులకోసం పెదవులు మూసుకున్నారని కేసీఆర్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు అసెంబ్లీలో తెలంగాణ పదం వద్దన్నారన్నారు. తె లంగాణను ఆంధ్రాతో నెహ్రూ విలీనం చేస్తే, 1969లో ఇందిరాగాంధీ తెలంగాణ ఉద్యమకారులను కాల్చి చంపారని ఆరోపించారు. తెలంగాణ నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్ అని విమర్శించారు. తాను, జయశంకర్ కలిసి 36పార్టీలను తెలంగాణ కోసం ఒప్పించి, యూపీఏ హయాంలో కామన్ మినిమం ప్రోగ్రాంలో పెట్టించామన్నారు. తాను నిరహార దీక్షకు దిగితే డిసెంబర్ 9 ప్రకటన వచ్చిందని కేసీఆర్ తెలిపారు. తర్వాత ప్రకటన వెనక్కి తీసుకొని కాంగ్రెస్ మోసం చేస్తే మళ్లీ ఉద్యమించినట్లు కేసీఆర్ గుర్తుచేశారు. చివరకు ప్రజా ఉద్యమానికి తలొగ్గి కేంద్రం తెలంగాణ ఇచ్చింది అని చెప్పారు.

అప్పటి సమైక్య రాష్ట్రంలో అన్ని రంగా ల్లో తెలంగాణ వెనక్కి నెట్టివేస్తే 2014లో తా ము అధికారంలోకి వచ్చి అభివృద్ధి చేశామ ని కేసీఆర్ తెలిపారు. కరువు కోరల్లో చిక్కిన పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేశామన్నారు. మిషన్ భగీరథతో చెరువులు బా గుచేసినట్టు వివరించారు. వరి పంటలో దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలిపామని చెప్పారు. దేశంలోనే రైతుబంధు సంచలన పథకం అన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే, ఎవరూ అడగకున్నా..రైతులకు గొప్ప పథకం తేవాలని తాను అనుకొని ఆ పథకం తెచ్చామన్నారు. కేంద్రంలోని బీజేపీ కూడా ఈ పథకం అమలు చేసినట్లు కేసీఆర్ తెలిపారు. తమ హయాంలో శాంతిభద్రతలు కాపాడామని, తమ ప్రభుత్వ పథకాలపై పార్లమెంటులో మంచి చర్చ జరిగిందని చెప్పారు. ఆర్బీఐ కూడా ప్రశంసలు తెలిపిందన్నారు.

## గోల్‌మాల్ కాంగ్రెస్..

కాంగ్రెస్ వచ్చి ఏడాదిన్నర అయినా ఏం బీమారి వచ్చిందనీ, వాళ్ళ హామీలను వారే గోల్‌మాల్ చేస్తున్నారని కేసీఆర్ ఆరోపించారు. కొందరు ఢిల్లీ నుంచి వచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. 'రైతుబంధు 15వేలు అన్నారు.. పెన్షన్ 4వేలు అన్నారు.. ఇంట్లో ఇద్దరికీ ఇస్తామన్నారు.. అమ్మాయిలకు స్కూటీలు.. యువతకు 5 లక్షల బ్యాంకు కార్డులు.. పంటలకు బోనస్ అన్నారు.. తులం బంగారం ఇస్తామన్నారు..' ఇవన్నీ ఇచ్చారా అని ప్రజలను సభావేదిక మీద నుంచి ప్రజలను కేసీఆర్ అడిగారు.

దీనికి వారు లేదు అంటూ సమాధానమిచ్చారు. హామీలే కాక బాండ్ పేపర్లు రాసి ఇంటింటికీ తిరిగి ఇచ్చినట్లు ఎద్దేవా చేశారు. ఎన్నో డైలాగులు కొట్టారని ఎంపీ ఎన్నికల్లో కుంటుకుంటూ తాను బయలుదేరి కాంగ్రెస్ బండారం బయటపెట్టిన అన్నారు. ఉచిత బస్సుతో మహిళలు జుట్టుపట్టి కొట్టుకుంటారనీ, అదేమని మాట్లాడితే కేసీఆర్, బీఆర్ఎస్‌పై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. అడ్డమైన, ఘోరమైన మాటలు చెప్పి మోసం చేశారని కేసీఆర్ విమర్శించారు. ప్రజలను ఇంత మోసం, దగాచేసిన పార్టీ కాంగ్రెస్ అని కేసీఆర్ విమర్శించారు.

## తెలంగాణను చూస్తే దుఃఖం కలుగుతోంది..

హామీలను అమలుచేయాలని అడిగితే పండుగల పేర్లు చెప్తున్నారని కేసీఆర్ ఎద్దేవాచేశారు. తెలివిలేక పరిపాలన చేయలేకపోతున్నారనీ, తాను బాగుచేసిన రాష్ట్రం ఇట్లా అయిందని మనసు బాధ కలుగుతోందని, దుఃఖం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూములుకొనేటోడు లేడు, రోడ్ల పక్క భూమి అమ్ముడు పోతలేదు, నా బాయి దగ్గర కూడా కరెంటు పోతోందనీ అన్నారు. మంచి నీళ్లు కూడా ఇవ్వలేక పోతున్నారని మండిపడ్డారు. 2014ముందు పరిస్థితులు వచ్చాయని అన్నారు. 'తాము అధికారంలో ఉన్నప్పుడు హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశాం.. పాలమూరు ప్రాజెక్టును 80 శాతం పూర్తిచేశాం.. ఆ ప్రాజెక్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి కూడా తీయడం లేదు. గౌరవెల్లి ట్రయల్స్ కూడా సక్సెస్ అయ్యింది. ఆ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకుంటలేదు.' అని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

పేద ఆడబిడ్డల కోసం కేసీఆర్ కిట్ పథకాన్ని తీసుకొస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేసిందని కేసీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనీ ఆరోగ్యశ్రీని తమ ప్రభుత్వం కొనసాగించిందని కేసీఆర్ వివరించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయగలరా అని ప్రశ్నించారు. ఈ సభకు కూడా ప్రజలు రాకుండా అడ్డంకులూ పెట్టారని, ఎన్ని అడ్డంకులు పెట్టినా జనప్రభంజం ఆపలేకపోయారని కేసీఆర్ తెలిపారు. ఆర్థిక మంత్రి చాంబర్లోనే కాంట్రాక్టర్లు కమీషన్ గురించి మాట్లాడే పరిస్థితులున్నాయని కేసీఆర్ మండిపడ్డారు. 20నుంచి 30శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని తాను చెప్పడం లేదని స్వయంగా కాంట్రాక్టర్లే చెబుతున్నారని తెలిపారు. 'నన్ను అసెంబ్లీ రా అంటారు.. కేటీఆర్ అవినీతిపై మాట్లాడితే భుజాలు తడుముకొంటున్నారు..'అని ఎద్దేవా చేశారు.

'భూములు అమ్మాలె.. అయితే దేనికోసం అమ్ముతున్నమో చూసుకోవాలి. యూనివర్సిటీల భూములు అమ్ముతున్నరు..మనం ప్రశ్నించకుంటే ఉస్మానియా యూనివర్సిటీ భూములు కూడా అమ్ముతరు..'' అని కేసీఆర్ మండిపడ్డారు.

**11ఏండ్లలో కేంద్రం 11పైసలివ్వలె..**

11ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసింది ఏమి లేదని కేసీఆర్ ఆరోపించారు. 157 మెడికల్ కాలేజ్లో ఒక్కటి కూడా రాష్ట్రానికి ఇవ్వలేదని కేసీఆర్ మండిపడ్డారు. మన సీలేరు ప్రాజెక్టును మోదీ గుంజుకున్నారని, 7 మండలాలను ఏపీలో కలిపారని విమర్శించారు. బీజేపీ వైఖరి అంతా భ్రభమానం.. భజగోవిందం అని, శుష్క ప్రియాలు, శూన్య హస్తాలు అని ఎద్దేవా చేశారు.

## ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి..

నక్సలైట్లపై ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారని, వెంటనే ఆపరేషన్ కగార్ నిలిపివేసి ఆపి చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరారు. 'చర్చలకు పిలువాలని నక్సలైట్లు కోరుతున్నారు..వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలువాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలి..ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి ఢిల్లీకి పంపుదాం' అని సభికులను చేత్తులెత్తి ఆమోదం తెలపాలని కేసీఆర్ కోరగా..వారు చేతులెత్తి ఆమోదం తెలిపారు.ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు రాష్ట్ర నలువైపుల నుంచి సుమారు 5లక్షల మంది హాజరైనట్లు అంచనా. 3వేల బస్సుల ద్వారా లక్షన్నర మంది, ఇతర ప్రైవేట్ వాహనాల ద్వారా రెండు లక్షలు, ఎడ్లబండ్లు, సైకిళ్లు, పాదయాత్ర ద్వారా, అలాగే ఎల్కతుర్తి సమీప గ్రామాల ప్రజలు 50వేల మంది..మొత్తంగా 5లక్షల మంది హాజరై ఉంటారని భావిస్తున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు వరంగల్, హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది పేదల జాగాలకు పట్టాలు ఇచ్చామని కేసీఆర్ గుర్తుచేశారు. బుల్డోజర్లు పెట్టి, జేసీబీలు పెట్టి తాము చెరువుల్లో పూడికలు తీస్తే వీళ్లేమో హైడ్రా అని, వాని బొందా అని పేదల ఇండ్లు కూలగొడుతున్నారన్నారు. ఏం చేద్దామో ఆలోచించాల్సిన సమయం వచ్చిందన్నారు.

# కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నారు



కేసీ ఆర్ మాట్లాడటం బాధ కలిగించింది.

రెండుసార్లు బీఆర్ఎస్‌కు అధికారమిస్తే.. ఎలా కొల్ల గొట్టారో ప్రజలు చూశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి.. మంచి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదారు పర్యాయాలు అసెంబ్లీ జరిగింది. కేవ లం రెండుసార్లే కేసీఆర్ వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా ఆయన వెళ్లలేదు. కేసీఆర్ దొర మాదిరిగా పరిపాలిస్తే.. మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది.

ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న సుపరిపాలన చూసి తట్టుకోలేక కేసీఆర్ విషంకక్కారు. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి.. కేసీఆర్ మాత్రం 150 ఎకరాల్లో వరి వేశారు. దయ్యా లు వేదాలు వల్లించినట్టు కేసీఆర్ మాట్లాడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రా క్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టిం ది. సర్పంచులకు కాంగ్రెస్ బకాయిలు పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులే లేరు.

మా ప్రభుత్వంలో సర్పంచులు ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటికలలు కంటున్నారు. బీఆర్ఎస్ సభకు ఆటంకాలు సృష్టించామని ఆయన ఆరోపించారు. సభకు అస్సలు ఆటంకం సృష్టించ లేదు.. మేమే ఇబ్బంది పెట్టి ఉంటే సభ జరిగేదా.. ఆ పార్టీ నేతలు అడిగినన్ని బస్సులను సభకు పంపాం' అని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

కేసీఆర్ పదేళ్లలో కలిపి కనీసం లక్ష ఇండ్లు కూడా కట్టలేదని.. తాము నాలుగున్నర లక్షల ఇండ్లు కట్టిస్తున్నామని పొంగు లేటి వ్యాఖ్యానించారు. సర్పంచులకు బాకీ లు ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్న పెండింగ్ అంతా కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు చెల్లించకుండా వదిలేసినవేనని తెలిపారు. దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని నిధులు రూ.1,500 కోట్ల డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. గురివింద సామెతలా కేసీఆర్ మాటలు ఉన్నాయని ఆరోపించారు.

నియంత అధికారం కోల్పోయిన తర్వాత ప్రజల వద్దకు వచ్చి కన్నీళ్లు పెట్టుకొన్న తీరుగా కేసీఆర్ వ్యవహారం కనిపిస్తోందని మంత్రి సీతక్క ఫైరయ్యారు. కేసీఆర్ బాధ కేవలం అధికారం పోయిందనే తప్ప మరేదేం కాదన్నారు. ప్రజల కోసం ఆయనకు బాధ ఉంటే గత పదేళ్లలో ప్రజలకు ఏం ఒరగబెట్టారో చెప్పాలన్నారు.

ఇంటికో ఉద్యోగం అన్నాడని.. కానీ ఆయన్ను నమ్ముకొని ఉద్యమం చేసిన నిరుద్యోగులు అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నా రు. తాము 15 నెలల్లో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు సర్క్యులేట్ చేసే వారిపై కేసులు తప్పనిసరిగా నమోదు చేయిస్తామన్నారు.

తన బిడ్డ ఖరీదైన కార్లలో తిరగవచ్చు కానీ, తెలంగాణ ఆడపచులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తే కూడా ఓర్వలేక తన మనుషులను పంపించి కొట్టుకొనేలా చేస్తున్నారని కేసీఆర్‌పై ఆరోపణలు చేశారు. అధికారం పోయాక కేసీఆర్ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని విమర్శించారు.

అసెంబ్లీలో సొల్లు కబుర్లు అని మాట్లాడే కేసీఆర్‌కు అసెంబ్లీలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. అలాంటప్పుడు నీ అల్లుడు, కొడుకుని సొల్లు కబుర్ల కోసం అసెంబ్లీకి ఎందుకు పంపిస్తున్నావని నిలదీశారు.

కేసీఆర్ వద్ద ఎన్ని వేల కోట్లుండాలి: మంత్రి జూపల్లి

ఇరిగేషన్ ఈఎన్‌సీపై ఏసీబీ దాడుల్లో రూ.200 కోట్లు దొరికితే, కేసీఆర్ వద్ద ఎన్నివేల కోట్లు ఉంటాయని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. కాళేశ్వరం ఇంజినీర్, కాంట్రాక్టర్, డిజైనర్ అంతా కేసీఆరే అని విమర్శించారు. పదేళ్లు పాలించిన కేసీఆర్, 16 నెలల కాంగ్రెస్ సర్కారుపై ఆరోపణలు చేయడం, కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపే ప్రయత్నం చేశారని విమర్శించారు.

తెలంగాణ ఇస్తే ఏపీలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా సోనియాగాంధీ రాష్ట్రం ఇచ్చిందని.. అప్పట్లో ఆమెను దేవతగా అభివర్ణించి, ఇప్పుడు ఇలా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే అప్పటివరకు రూ.64 వేల కోట్ల అప్పుంటే.. కేవలం 10 ఏళ్లలో రూ.8 లక్షల కోట్లకు చేర్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు.

గతంలో ఏడాదికి రూ.6 వేల కోట్ల వడ్డీ కడితే, ఇప్పుడు నెలకు రూ. 6వేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో మినహా మిగతా చాలా చోట్ల డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టేలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ పథకమైనా తాము ఎత్తేశామా అని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూములను పదేళ్లు అధికారంలో ఉండి కూడా ఎందుకు కాపాడలేకపోయారని ప్రశ్నించారు.

అంత పెద్ద మీటింగ్ పెట్టి, కేవలం కేసీఆర్ మాత్రమే ప్రసంగించడం ఆయన నిలువెత్తు నిరంకుశత్వానికి ఉదాహరణ అని అన్నారు. చింత చచ్చినా పులుపుచావలేదని విమర్శించారు. కేసీఆర్ అంత నిజాయతీ మనిషి అయితే బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో రూ.1,500 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఏ ఒక్క విషయంలోనూ ఈ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదన్నారు.

ఇతరుల ఫోన్లను ట్యాప్ చేయాల్సిన ఖర్మ ఎందుకు పట్టిందన్నారు. నిందితులు విదేశాల్లో తలదాచుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడమనేది అసాధ్యమన్నారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు ప్రగతి భవన్, ఫాం హౌజ్‌కు వెళ్లాలన్నా ఎంతో కష్టంగా ఉండేదని తెలిపారు. ఇప్పటికైనా కేసీఆర్‌కు జ్ఞానోదయం కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు విలన్ అన్న కేసీఆర్ మాటలు ఉపసంహరించుకోవాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. రేపు తెలంగాణలో అన్ని జిల్లా ల్లో సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకాలు చేయాలని కాంగ్రెస్ పార్టీని కోరారు. సోనియాగాంధీ కాదంటే తెలంగాణ ఎలా వచ్చేదని ప్రశ్నించారు. కేసీఆర్ అంతర్గత కలహాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఆ అసహనం ఆయన మాటల్లో స్పష్టంగా తెలుస్తోందన్నారు.

# క్యాడర్‌లో ఫుల్ జోష్

కేసీఆర్ తన ప్రసంగాన్ని 'జననీ జన్మభూమిచ్చ స్వర్గదపి గరీయసీ..' అంటూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన ఉద్యమాన్ని, తెలంగాణ సాధన అనంతరం పదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తొలుత ప్రసంగంలో నిశబ్దంగా కేసీఆర్ ప్రసంగాన్ని విన్న కార్యకర్తలు తదుపరి కాంగ్రెస్‌పై విరుచుకుపడుతూ చేసిన ప్రసంగానికి ఈలలు, చప్పట్లతో స్పందించారు.

కాంగ్రెస్‌తో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈ పదకొండు నెలల పాలనలో పదకొండు రూపాయలు కూడా ఇవ్వలేదని పేర్కొంటూ, ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాల ఏపీలో కలిపారని, తెలంగాణపై పార్లమెంట్‌లో మోదీ చేసిన ప్రసంగాన్ని ఎండగడుతూ మాట్లాడిన సందర్భంలో కూడా స్పందన లభించింది. ఛత్తీస్‌గడ్‌లో మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కాగార్'తో గిరిజనులు, యువకులు మృత్యువాత పడుతున్నారని, నక్సలైట్లు చర్చలకు సిద్ధమన్న సందర్భాన్ని పురస్కరించుకొని వారితో చర్చలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేసిన సందర్భంలో కార్యకర్తల నుంచి స్పందన లభించింది.

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై పోలీసులు కేసులు పెడుతున్న తీరుపై మండిపడ్డారు. తాము చట్టానికి లోబడి ఉంటామని పోలీసులు కేసులు పెట్టే విషయంలో ఆలోచించాలని, సోషల్ మీడియా వారియర్స్ భయపడవద్దని, మీకు అండగా బీఆర్ఎస్ లీగల్ టీమ్ ఉంటుందని పేర్కొనడంతో సోషల్ మీడియా వారియర్స్ చప్పట్లతో జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాదిన్నర పాలన, వైఫల్యాలు, తెలంగాణకు నెహ్రూ, ఇందిరాగాంధీ కాలం నుంచి దగా చేశారంటూ.. కార్యకర్తలను ఉత్తేజపరిచే ప్రయత్నం కేసీఆర్ చేశారు.

కేసీఆర్ 6 గంటల సమయానికి ప్రాంగణానికి చేరుకొని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గుడారంలో గంటపాటు వివిధ నాయకులతో చర్చించిన అనంతరం 7 గంటలకు వేదికపైకి వచ్చి 40 నిమిషాలపాటు ప్రసంగించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ చేసిన ప్రసంగానికి పెద్దగా స్పందన లభించలేదు. చాలా యేళ్ల తర్వాత పోరుగడ్డపై ఏర్పాటు చేసిన రజతోత్సవ సభలో ఆయన ప్రసంగానికి అద్భుత స్పందన లభించడంతో బీఆర్ఎస్ నాయకుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఆయన ప్రసంగం పూర్తయ్యేవరకు కూడా కార్యకర్తలు, పార్టీ నాయకులు కదలకుండా కూర్చున్నారు. సభా ప్రాంగణం బయట కూడా భారీసంఖ్యలో జనం కనిపించారు.



# ఏటా 60 వరకు డబుల్ రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్: రాష్ట్రంలో డబుల్ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయనున్నారు. రాబోయే రోజుల్లో ఒక వ్యక్తి ఒక ప్లాట్‌ను విక్రయించిన తర్వాత, అదే వ్యక్తి అదే ప్లాట్‌ను మరొకరికి విక్రయించడం కుదరదు. డబుల్ రిజిస్ట్రేషన్ మోసాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. 1908 నాటి రిజిస్ట్రేషన్ చట్టంలో సవరణలు చేయ డం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లను నియంత్రించాలని నిర్ణయించింది. అనధికారిక లేఅవుట్లు, ఓపెన్ ప్లాట్ల లో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతుంటాయి. నకిలీ పత్రాల ద్వారా మోసపూరిత రిజిస్ట్రేషన్లకు పాల్పడే వ్యక్తుల వల్ల కొనుగోలుదారులు తీవ్రం గా నష్టపోతున్నారు. మోసపోయినట్లు తెలుసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలంటే కోర్టు ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఒకసారి రిజిస్ట్రేషన్ జరిగాక.. దాన్ని రద్దు చేసే అధికారం సబ్‌రిజిస్ట్రార్‌కు ఉండదు. ఈ క్రమంలో డబుల్ రిజిస్ట్రేషన్లను నిలువరించే అధికారాలను సబ్ రిజిస్ట్రార్లకు కట్టబెట్టేలా సెక్షన్ 22-బి అమల్లోకి తీసుకొచ్చేందుకు సర్కారు సిద్ధమైంది.

రాష్ట్రంలో 2024 లెక్కల ప్రకారం 1.53 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఓపెన్ ప్లాట్ల అమ్మకాల విషయంలో డబుల్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఇటీవల కాలంలో రెరా అథారిటీకి పిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు డబ్బు చెల్లించిన కొనుగోలుదారుకు దక్కాల్సిన ప్లాట్‌ను మరో వ్యక్తికి కూడా రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతాలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. డబ్బులు చెల్లించి మోసపోయిన వారు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కొనుగోలుదారుల హక్కులకు మరింత భద్రత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చట్టంలో సవరణలకు ప్రతిపాదించింది. సెక్షన్ 22-బి ద్వారా ప్రతి సబ్ రిజిస్ట్రార్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ముందు తప్పనిసరిగా ఈసీని పరిశీలించడం ద్వారా అప్పటికే ఒక వ్యక్తికి విక్రయించిన ప్లాట్ మరో వ్యక్తికి విక్రయించకుండా అడ్డుకునే అధికారం కల్పిస్తున్నారు. ఒకవేళ నకిలీ పత్రాలతో మోసపూరిత రిజిస్ట్రేషన్‌కు పాల్పడితే ఈ చట్ట సవరణ ద్వారా దాన్ని రద్దు చేసే అధికారాన్ని కూడా సబ్ రిజిస్ట్రార్లకు కల్పిస్తారు. ఇప్పటికే రెండు దశాబ్దాల క్రితం 22 ఏ సెక్షన్ ద్వారా ప్రభుత్వ భూములను రక్షించేందుకు రిజిస్ట్రేషన్లు జరగకుండా అడ్డుకట్ట వేసిన రిజిస్ట్రేషన్ శాఖ.. 22-బి ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లను నిలువరించేందుకు సన్నద్ధమవుతోంది. చట్టంలో సవరణలు చేసి, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించనున్నారు. తర్వాత అనుమతి కోసం కేంద్రానికి పంపనున్నారు. కేంద్ర హోం, న్యాయ శాఖల పరిశీలన అనంతరం రాష్ట్రపతి ఆమోదంతో సవరణలకు చట్టబద్ధత రానుంది. 2021లో తమిళనాడు ప్రభు త్వం డబుల్ రిజిస్ట్రేషన్లను అడ్డుకునే అధికారాలను సబ్ రిజిస్ట్రార్లకు కట్టబెట్టగా, 2023లో ఏపీ ప్రభుత్వం ఇలాంటి అధికారాలనే కల్పించింది.

ఒకరికి బదులు మరో వ్యక్తి వచ్చి రిజిస్ట్రేషన్ చేయ డం, రికార్డుల్లో రాసిన సర్వే నంబరు ఒకటి ఉంటే.. భౌతికంగా భూమి వేరే చోట చూపడం, తల్లిదండ్రులు ఎప్పుడో విక్రయించిన తర్వాత వారసులు అడ్డం తిరగడం, హద్దులు మార్చి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు.. ఇలా పలు రకాల మోసాలతో నిత్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏదో ఒకచోట వివాదాలు తలెత్తుతుంటాయి. ప్రస్తుతానికి డబుల్ రిజిస్ట్రేషన్లను కట్టడి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. దశల వారీగా అన్ని రకాల మోసాలను అరికట్టేలా చట్టాన్ని బలోపేతం చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు.



## హైదరాబాద్‌లో పాకిస్తానీయులకు

# లీవ్ ఇండియా నోటీసులు

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ పాక్ పై దౌత్య దాడికి దిగింది. ఇందులో భాగంగా భారత్ లో ఉన్నటు వంటి పాక్ పౌరులను ఆ దేశానికి పంపించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో హైదరాబాదులోని పాకిస్తానీయులకు లీవ్ ఇండియా పేరుతో అధికారులు నోటీసులు అందజేశారు. హైదరాబాదులో మొత్తం 230 మంది పాకిస్తానీయులు ఉన్నట్లు గుర్తించారు. 199 మందికి లాంగ్ టర్మ్ వీసాలు, 31 మందికి షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నాయని గుర్తించారు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్న ఎనిమిది మందికి దేశం విడిచిపోవాలని నోటీసులు జారి చేశారు. మెడికల్ వీసాలు తీసుకున్న వారికి ఈ నెల 29 వరకు గడువు విధించారు. పాకిస్తానీయులు తెలంగాణ రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలని డిజిపి డాక్టర్ జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నవారు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు.

ఇమ్మిగ్రేషన్ అధికారులు అందించిన వివరాల ప్రకారం హైదరాబాద్ సహా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 230 మంది ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.
వీరిలో సిటీ కమిషనరేట్ పరిధిలో పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో 156 మందికి పైగా నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఇందులో లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ సహా ఇతర వీసాలు కలిగి ఉన్న వారి కోసం పోలీసులు గాలిస్తు న్నారు. పాకిస్తాన్‌లో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలతో డేటాను రికార్డ్ చేస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారుల అందించిన పాకిస్తానీయుల డేటా ఆధారంగా ఆయా అడ్రసుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలోనే వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమం గా నివాసం ఉంటున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

సోమవారం నుంచి సోదాలు తీవ్రతరం చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. పర్మినెంట్ వీసాలు కలిగి ఉన్న వారి పాస్‌పోర్టులపై స్టాంపింగ్ ఆధారంగా వారి ట్రావెల్ హిస్టరీని సేకరించనున్నారు.
ఈ క్రమంలోనే ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు (ఎఫ్ఆర్ఆర్ఒ) రికార్డుల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. పర్మినెంట్ వీసాలపై వచ్చిన వారు ప్రస్తుతం ఎలాంటి పనులు చేస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితులు, పాస్‌పోర్టులపై స్టాంపింగ్ సహా ప్రయాణ వివరాలను తెలుసుకుంటున్నారు. దీంతో పాటు పాకిస్తానీయులను దేశం నుం చి పంపించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధి విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఓ పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. రోహింగ్యాలపై కూడా నిరంతర నిఘా కొనసాగు తోందని స్పష్టం చేశారు.

# మే 2 రాష్ట్ర చరిత్రలోనే గొప్ప మలుపు

అమరావతి: నిన్నటి విధ్వంసం నుంచి రేపటి వికాసం వైపు రాజధాని ప్రయాణం సాగనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మే 2న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభ కార్యక్రమంపై చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. బహిరంగ సభ, భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని అనేక కుట్రలు, దాడులు చేసిందని.. అయితే అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల అభిలాష మేరకు ప్రారంభమైన అమరావతి అనేక సవాళ్లను, కష్టాలను ఎదుర్కొని నిలబడిందని అన్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనులు మళ్లీ ప్రారంభమవుతున్నాయని, ఆ రోజు రాష్ట్ర చరిత్రలో గొప్ప మలుపు కానుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన 10 నెలల్లో గత ప్రభుత్వం కారణంగా తలెత్తిన అన్ని సవాళ్లను పరిష్కరించి, నిలిచిపోయిన రాజధాని పనులను మళ్లీ పట్టాలెక్కిస్తున్నామని తెలిపారు. అమరావతి అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష, సెంటిమెంట్ అని.. దీన్ని ఎవరూ దెబ్బతీయలేరని సీఎం అన్నారు. అమరావతి సంపద సృష్టి కేంద్రంగా.. అన్ని వర్గాల ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాంతంగా మారుతుందన్నారు.

కుట్రలకు, కుతంత్రాలకు ప్రజారాజధాని బలికాబోదని, ఆంధ్రుల రాజధాని స్వప్నాన్ని ఎవరూ చెరిపివేయలేరని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దేశమంతా గుర్తించేలా రాజధాని పనులను స్వయంగా ప్రధాని చేతుల మీదుగా పునఃప్రారంభిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా.. వేడుకగా నిర్వహించాలని, రాష్ట్రంలో ప్రతి పౌరుడు 'నాది ఆంధ్రప్రదేశ్.. నా రాజధాని అమరావతి' అని చెప్పుకొనేలా అమరావతి నిర్మాణం జరుగుతుందని అన్నారు. ప్రధాని కూడా రాజధాని నిర్మాణంపై ఆసక్తితో ఉన్నారని, మొన్న జరిగిన ఢిల్లీ భేటీలో పలు సూచనలు చేశారని సీఎం పేర్కొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

ప్రధాని సభ ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చూడాలని, ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి తాగునీరు, ఆహారం అందించాలని సీఎం సూచించారు. భద్రతాపరంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా రాజధాని గ్రామాల ప్రజలకు ఈ కార్యక్రమంలో ఎక్కువ భాగస్వామ్యం ఉంటుందని, వారంతా సభకు రావాలని భావిస్తారని, వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సమీక్షలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, డీజీపీ హర్షకుమార్ గుప్తా, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ముగిసిన రాష్ట్ర మహాసభలు

ఖమ్మం: విద్యా వ్యవస్థలోని లోపాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వాటిపైనే కాక ప్రజా సమస్యలపై కూడా విద్యార్థులు ఉద్యమించాలని జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ ముగింపు సభకు హాజరైన నితీష్ నారాయణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ హిందుత్వ అజెండాను విద్యార్థులు, యువత అడ్డుకోవాలని కోరారు. సామాజిక సమస్యలపై విద్యార్థులు ఉద్యమ కార్యచరణ చేపట్టాలని సూచించారు.

గుజరాత్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను జనాభా ప్రాతిపదికన కాకుండా కులాల ప్రాతిపదికన ఏర్పాటు చేయడంపై అక్కడి పోరాటం చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా వివరించారు. కాగా, నూతన విద్యా విధానం రద్దు, విద్యార్థి సంఘాలు ఎన్నికల నిర్వహణ, గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మాణం సహా 17 అంశాలపై చేసిన తీర్మానాలను మహాసభల్లో ఆమోదించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల నివేదిక సమర్పణ సందర్భంగా సభ మారుమోగింది. ముగింపుసభలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడారు. కాగా, మహాసభల ముగింపు సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రజనీకాంత్(కరీంనగర్), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం జిల్లాకు చెందిన తాళ్ల నాగరాజు ఎన్నికయ్యారు. వీరితో పాటుగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.

# అధిక వడ్డీ ఆశ చూపి ఘరానా మోసం

కర్నూలు: అధిక వడ్డీ ఆశ చూపి ఓ సంస్థ ఘరానా మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా రూ.270 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరిస్తే.. కర్నూలు జిల్లా నుంచే రూ.60-70 కోట్లకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కంపెనీ అకౌంట్ బ్లాక్ చేశారంటూ ఆ సంస్థ చేతులెత్తేసింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. డిపాజిట్లు సేకరించి మోసం చేశారంటూ శ్రేయ ఇన్‌ఫ్రా మార్కెటింగ్ ప్రైవేట్‌లిమిటెడ్ కంపెనీపై ఓ వ్యక్తి ఫిర్యాదుతో కర్నూలు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కేంద్రంగా 2020లో స్థాపించిన ఈ కంపెనీకి చైర్మన్ హేమంత్‌కుమార్ రాయ్. రియల్ ఎస్టేట్ (స్థిరాస్తి) వ్యాపారం పేరిట.. తమ వద్ద పెట్టుబడులు పెడితే ఏడాది తిరక్కుండానే రెట్టింపు ఇస్తామని మభ్యపెట్టారు. ఈ సంస్థ దేశంలోని పలు ప్రాంతాల్లో అధిక వడ్డీలు ఆశ చూపి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నట్లు సమాచారం. 2023 నుంచి కర్నూలు నగరంలో ఓ భవనం అద్దెకు తీసుకొని ఏజెంట్ల ద్వారా డిపాజిట్ల సేకరణ చేపట్టారు. జనాన్ని నమ్మించడానికి కొంత భూమి కొనుగోలు చేసినట్లు సమాచారం. మొదట్లో డిపాజిట్‌దారులకు నెలనెలా ఖాతాలో నగదు జమ చేస్తుండడంతో నమ్మకం ఏర్పడింది. 2024 జూన్ నుంచి చెల్లింపులు ఆపేశారు.

రూ.లక్షకు రూ.1.80 లక్షలు చెల్లిస్తామని..

కర్నూలు నగరంతో పాటు వామసముద్రం, తడకనపల్లెతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 500-600 మంది నుంచి డిపాజిట్లు సేకరించారని సమాచారం. రూ.లక్ష డిపాజిట్ చేస్తే.. నెలకు రూ.12 వేల చొప్పున 15 నెలలకు రూ.1.80 లక్షలు గానీ, రూ.11 వేల ప్రకారం 18 నెలలు రూ.1.98 లక్షలు చెల్లిస్తామని ఆశ చూపారు. అంటే.. నెలకు నూటికి వడ్డీ రూ.5.25లు పైమాటే. మొదట్లో నెలనెలా డబ్బులు జమ చేస్తుండడంతో.. డిపాజిట్లు రూ.60-70 కోట్లకు చేరాయని, ఆ తర్వాత చెత్తులేసిందని చెబుతున్నారు. గత జూన్ నుంచి చెల్లింపులు ఆపేసినట్లు తెలుస్తోంది. ఖాతాదారులు ప్రశ్నిస్తే.. ఎన్నికల సమయంలో కంపెనీ అకౌంట్ బ్లాక్ చేయడం వల్లే చెల్లింపులు చేయలేకపోయామని, త్వరలోనే చెల్లింపుల ప్రక్రియ ప్రారంభమవుతుందంటూ కొన్ని నెలలు కాలం గడిపేశారు. ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో వడ్డీ లేకుండా మీ డబ్బులు తిరిగి వచ్చే ఏర్పాట్లు చేస్తామని చెబుతున్నారని, అదీ లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల్లో సంస్థ ఏజెంట్లు, డిపాజిట్‌దారులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాౡధ్యాయులు, కొందరు పోలీసులు కూడా ఉన్నట్లు సమాచారం.

శ్రేయ ఇన్‌ఫ్రాపై కేసు.. సీఐడీకి బదిలీ..

కర్నూలుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి గత ఏడాది నవంబరు 22న సంస్థ చైర్మన్‌తో పాటు పలువురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును సీఐడీకి బదిలీ చేశామని త్రీటౌన్ సీఐ శేషయ్య తెలిపారు. ఏడాదిగా చెల్లింపులు ఆగిన మాట నిజమేనని, డిపాజిట్ మాత్రమే చెల్లించేలా ఖాతాదారుల నుంచి ఎన్‌వోసీలు తీసుకొని హెడ్ ఆఫీసుకు పంపిస్తున్నామని, వచ్చే నెల మొదటి వారంలో చెల్లింపులు మొదలయ్యే అవకాశముందని కంపెనీ సీనియర్ లీడర్ మహేశ్ తెలిపారు.

# లోన్ యాప్ ముఠా అరెస్ట్

ఎపిలో పాకిస్థాన్ నుంచి ఆపరేట్ అవుతున్న లోన్ యాప్ ముఠా అరెస్టు చేశారు. లోన్ యాప్‌ల ద్వారా ఆర్థిక నేరాలకి పాల్పడుతోన్న ముఠా గుట్టును విశాఖ నగర పోలీసులు రట్టు చేశారు. అందుకు సంబంధించి ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో ప్రధాన నిందితుడుతో సహా 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే రూ.60 లక్షల విలువైన క్రిప్టో కరెన్సీని పోలీసులు సీజ్ చేశారు. ఆదివారం విశాఖపట్నంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రూ.2 వేలు లోన్ యాప్‌లో అప్పు తీసుకున్న నరేంద్రను వేధించిన కేసులో పురోగతి సాధించినట్లు తెలిపారు. నరేంద్ర భార్య ఫోటోలను మార్ఫింగ్ చేసి సైబర్ నేరగాళ్లు బంధువులకు పంపారన్నారు. ఆ అవమాన భారంతో పెళ్లయిన 40 రోజులకు నరేంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తు చేశారు. ఈ లోన్ యాప్‌ను ఈ ముఠా పాకిస్థాన్ కేంద్రంగా నడుపుతోనట్లు గుర్తించామని వెల్లడించారు. దీని ద్వారా దాదాపు రూ.200 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. సుమారు భారత్ నుంచి 9 వేల మంది బాధితులు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు గుర్తించామని స్పష్టం చేశారు. ఈ ముఠా నుంచి 18 మొబైల్ ఫోన్లు,ఒక ల్యాప్ టాప్,54 సెల్ ఫోన్ సిమ్ములు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విశాఖపట్నం మహారాణి పేట అంగటిదిబ్బ ప్రాంతానికి చెందిన ఎస్ నరేంద్ర ఆన్‌లైన్ లోన్ యాప్‌లో కొంత మొత్తంలో నగదు అప్పు తీసుకున్నాడు. రూ.2 వేలు మినహా మిగిలినదంతా చెల్లించాడు. కానీ ఆ రూ.2 వేల కోసం అతడిని లోన్ యాప్ నిర్వాహకులు వేధించడం ప్రారంభించారు.అతడి భార్య ఫోన్‌కు మార్ఫింగ్ ఫొటోలు పంపి నరేంద్రతో వెంటనే నగదు కట్టించాలని, లేకుంటే మరిన్ని ఫొటోలు పంపిస్తామని



బెదిరించారు. హతాశురాలైన ఆమె ఏం జరిగిందని భర్తను నిలదీయగా లోన్ యాప్ వాళ్లకు రెండు వేలు చెల్లించాలని చెప్పాడు.
తమ వద్ద ఉన్న రూ.2 వేలు వెంటనే చెల్లించేశారు.అప్పటికే యాప్ నిర్వాహ కులు మార్ఫింగ్ ఫొటోలను నరేంద్ర ఫోన్ కాంటాక్ట్ లిస్టులో ఉన్న వాళ్లందరికీ పంపించేశారు. దాన్ని తీవ్ర అవమానంగా నరేంద్ర భావించాడు. భార్య నిద్రలో ఉండగా అతడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు

# మహిళల రక్షణకు టీ సేఫ్

నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగు తూనే ఉన్నాయి. ఇటీవల నగరం నడిబొడ్డున ఓ యువతిపై జరిగిన అత్యాచార ఘటన రాష్ట్ర ప్రజలను ఉలిక్కిపాటుకు గురి చేసింది. ఇ లాంటి దారుణాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఏడాది క్రితం టీ సేఫ్ యాప్ను అందుబాటులోకి తీసుకువచ్చింది.
కేవలం మహిళల రక్షణ కోసమే ఈ యాప్ను రూపకల్పన చేశారు. అయితే ఏడా ది కావస్తున్నా యాప్ను వినియోగిస్తున్న వారి సంఖ్య చాలా తక్కువుగా ఉంది. మహిళలు దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు టీ సేఫ్ యాప్లో నమోదు చేసుకోవడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరవచ్చని పోలీసులు అంటున్నారు.
మొబైల్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా టీ సేఫ్ యాప్ అని టైప్ చేసి సెర్చ్ చేస్తే రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన యాప్ కనిపిస్తుంది. దాన్ని డౌన్లోడ్ చేసుకుని పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసి రిజిష్టర్ అవ్వాల్సి ఉంటుంది. హెల్ప్ సిటిజన్ విభాగంలో క్లిక్ చేసి ప్రయాణిస్తున్న ప్రాంతం పేరు, ప్రయాణిస్తున్న వాహనం, దాని రిజిస్ట్రేషన్ నంబర్ నమోదు చేయాలి. ఒకవేళ రైలు ప్రయాణం చేస్తే ఆ రైలు రూట్ నంబర్ ఎంటర్ చేస్తే చాలు. అనంతరం ప్రయాణం ప్రారంభించే ముందు స్టార్ట్ బటన్ నొక్కగానే సదరు సమాచారం పోలీసు శాఖ పర్యవేక్షణలోకి వెళ్తుంది. ఇక అప్పటి నుండి ఆ వాహనం లోకేషన్ గమ్యం చేసేవరకు పోలీసుల పర్యవేక్షణలో ఉంటుంది.
ప్రయాణిస్తున్న వాహనం రూటు మారి నా, ప్రయాణ సమయానికన్నా ఆలస్యం అయినా పోలీసుల నుంచి ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి మెసేజ్లు వస్తాయి. దానికి వినియోగదారుల నుంచి రిప్లే ఇవ్వకుంటే కేసును అనుమానాస్పదం గా పరిగణించి నేరుగా ప్రయాణిస్తున్న వాహనం వివరాలు డయల్ 100కు వెళ్తాయి. లోకేషన్ ఆధారంగా సమీప పోలీస్ స్టేషన్ లేదా పెట్రో లింగ్ వాహనానికి సమాచారం చేరవేస్తా రు.నిమిషాల వ్యవధిలో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని బట్టి అవసరమైన చర్యలు తీసుకుంటారు. అనుకోని సందర్భాల్లో, విపత్కర పరిస్థితుల్లో ఇబ్బందులు పడే మహిళలను రక్షించేందుకు ఈ యాప్ చక్కగా ఉపయోగపడుతుం దని, ఒంటరి మహిళలకు, యువతులకు రక్షణ కవచంలా పని చేస్తుందని పోలీసు అధికారులు చెబుతున్నారు. మెదక్ జిల్లాలో టీ సేఫ్ యాప్ గురించి పోలీసు శాఖ అవగాహన కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. డయల్ 100, షీ టీంల పనితీరుపై అవగాహన సదస్సు పెడుతున్నారు తప్ప కొత్తగా ప్రవేశపెట్టిన టీ సేఫ్ యాప్ గురించి మహిళలకు, విద్యార్థినులకు అవగాహన కల్పించడం లేదు. ఇప్పటికైనా ఈ యాప్ గురించి అవగాహన కల్పిస్తే చాలా మంది యువతులకు రక్షణగా ఉం టుందని పలువురు భావిస్తున్నారు.

# సిఫార్సు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు

వేసవి సెలవుల దృష్ట్యా టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి తిరుమలలో సిఫార్సు లేఖల బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. జులై 15 వరకు సిఫార్సు లేఖలు అనుమతించబోమని టీటీడీ ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, టీటీడీ బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని టీటీడీ స్పష్టం చేసింది. ప్రొటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు సిఫార్సు లేఖలు రద్దు చేసినట్లు టీటీడీ స్పష్టం చేసింది.
వీఐపీ బ్రేక్ దర్శనాల సమయంలో మార్పులు : తిరుమలలో మే 1 నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాల సమయంలో టీటీడీ మార్పులు చేసింది. మే 1 నుంచి ఉదయం 6 గంటల నుంచి వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రారంభం అవుతాయని వెల్లడించింది. వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే వీఐపీ దర్శనం కల్పిస్తామని వెల్లడించింది. మే 1 నుంచి జులై 15వ వరకు ఈ నిర్ణయం అమలౌతుందని స్పష్టం చేసింది. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.
మరోవైపు వేసవి సెలవులు, వారాంతం నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల తాకిడి భారీగా పెరిగింది. సర్వదర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులతో శ్రీవారిమెట్టు మార్గంలో శనివారం తెల్లవారుజామునుంచే ట్రాఫిక్ స్తంభించింది. చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు అల్లాడిపోయారు. ఎస్ఎస్‌డీ టోకెన్ల కోసం క్యూలో ఉన్న భక్తులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. నెలల చిన్నారులతో క్యూలైన్‌లో ఉన్న తల్లుల పరిస్థితి వర్ణనాతీతం.
తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శ్రీనివాసుడిని దర్శించుకునేందుకు 31 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శనివారం నాడు స్వామివారిని 82,811 మంది భక్తులు దర్శించుకోగా, 34,913 మంది తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.24 కోట్లు వచ్చింది. మరోవైపు తిరుమలలో పోలీసుల హైఅలర్ట్ కొనసాగుతోంది. నిఘావర్గాల హెచ్చరికలు, ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాలతో చెకింగ్స్ చేపట్టారు. బస్టాండ్లు, హోటళ్లు, మఠాల వద్ద బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఘాట్ రోడ్లలో పలుచోట్ల వాహనాలను తనిఖీ చేస్తున్నారు.



# ఈఎన్సీ హరిరామ్ అరెస్టు

హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఈఎన్‌సీ భూక్యా హరిరామ్ కూడబెట్టిన ఆస్తుల విలువ రూ.200 కోట్ల పైమాటేనని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, తన బినామీల గుట్టును హరిరామ్ బయటపెట్టలేదని సమాచారం. దీంతో ఆయ న్ను కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టాలని ఏసీబీ భావిస్తోంది. హరిరామ్‌ను శనివారం అదుపులోకి తీసుకున్న అధికారులు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించగా హరిరామ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.
వేలకోట్ల పనుల్లో భాగస్వామి కాళేశ్వరం ప్రాజెక్టు సహా నీటిపారుదల శాఖలోని పలు ముఖ్యమైన ప్రాజెక్టుల్లో హరిరామ్ కీలకపాత్ర పోషించారు. హరిరామ్ చేతుల మీదుగా వేలకోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టుల పనులు జరిగాయి. ఈ క్రమంలోనే హరిరామ్ భారీగా అక్రమఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లకు పైగా విలువ ఉండే ఆస్తులను ఇప్పటిదాకా గుర్తించామని అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ఉన్న మర్కూక్ మండలంలో హరిరామ్ 28 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో హరిరామ్‌కు రెండు విల్లాలుండగా వాటి విలువ రూ.10 కోట్లకు పైనే ఉంటుందని సమాచారం. ఇక, హైదరాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీ, మాదాపూర్, నార్సింగ్ ప్రాంతాల్లో ఆయనకు ఉన్న ఫ్లాట్ల విలువ రూ.10 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. ఏపీ రాజధాని అమరావతిలో హరిరామ్‌కు ఉన్న వాణిజ్య స్థలం విలువ రూ.20 కోట్లు ఉండవచ్చునని చెబుతున్నారు. ఇవే కాక, పటాన్‌చెరు లాంటి కీలక ప్రాంతంలో 20 గుంటల స్థలం, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు, బొమ్మలరామారంలో ఆరు ఎకరాల మామిడితోటలో ఖరీదైన ఫామ్‌హౌస్, కొత్తగూడెంలో ఓ వాణిజ్య సముదాయం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో ఇళ్ల స్థలాలు గుర్తించారు. హరిరామ్‌కు చెందిన కొన్ని బ్యాంకు లాకర్లు ఇంకా తెరవాల్సి ఉంది. వారం రోజులు కస్డడీ కోరుతూ ఏసీబీ సోమవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

## నేత్ర ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



మేడ్చల్, నేడు న్యూస్: మేడ్చల్ పట్టణం కండ్లకోయలోని సాయి గీత ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత నేత్ర ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో భారీ ఎత్తున ప్రజల హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ శిబిరంలో యశోద హాస్పిటల్స్ కు చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు డా. సరికి వెంకట రావు డా. ఎం. భాను ప్రకాష్ హాజరై రోగులను పరిశీలించి వైద్య సలహాలు అందించడమే కాకుండా అవసరమైన మందులు కూడా సూచించారు.శిబిరంలో భాగంగా, సాయి గీత ఆశ్రమం తరపున అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు.నేత్ర పరీక్షలు, దృష్టి పరీక్షలు, కంటి సంరక్షణపై సూచనలు వంటి సేవలు అందించారు. సాయి ఆశ్రమం మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రజలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాయి ఆశ్రమం ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి వల్లనే మాదిగలకు 9 శాతం రిజర్వేషన్

*మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి



మేడ్చల్,నేడున్యూస్:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్లనే మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ వచ్చిందని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు, మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గుండ్ల పోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టరు పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, సహచర మంత్రులు అందరూ కలిసి మాదిగలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తూ తొమ్మిది శాతం రిజర్వేషన్ ఇచ్చే విధంగా కృషి చేశారన్నారు, వర్గీకరణకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు కాంగ్రెస్ పెద్దలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, కావలి చిన్నయ్య ముదిరాజ్, మీసాల మల్లేష్, కుండ ప్రవీణ్ కుమార్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ జెండా పండుగ



మేడ్చల్,నేడున్యూస్ మేడ్చల్ మండలం శ్రీరంగావరంలో బిఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా జెండా పండుగను నిర్వహించారు. గ్రామ కూడల్లో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బాల్ రాజ్ ముదిరాజ్, రాజు రెడ్డి మాధవరెడ్డి రంగారెడ్డి సిహెచ్ రాములు యాదయ్య ముదిరాజ్, రవి ముదిరాజ్ బాలకృష్ణ నాయి, బిక్షపతి,సాయిబాబా, వినోద్ ముదిరాజ్ రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ లో జరిగిన కేసీఆర్ బహిరంగ సభకు తరలి వెళ్లారు.

## ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుక

25వ డివిజన్లో బీఆర్ఎస్ జండాలను ఎగురవేసిన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి



పీర్జాదిగూడ, నేడు న్యూస్: బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నగర పరిధిలోని 25వ డివిజన్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఎగరవేశారు. పీర్జాదిగూడ నగర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంతో పాటుగా 25వ డివిజన్, 3వ డివిజన్, 14వ డివిజన్ లలో తెలంగాణ తల్లి చిత్ర పటానికి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పోడులో విద్యుత్‌కు అటవీ అనుమతులు ఇప్పించాలి

వైరా ఎమ్మెల్యేకు సీపీఐ(ఎం) వినతి.

కారేపల్లి నేడు న్యూస్. అటవి హక్కులు ఉండి విద్యుత్ సౌకర్యం మంజూరైన గిరిజనల పోడులో విద్యుత్ కనెక్షన్ ఇవ్వటానికి అటవీ శాఖ ద్వారా అనుమతులు ఇప్పించాలని కోరుతూ పోడు రైతులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ వినతి పత్రం అందజేశారు. ఆర్వోఎఫ్ఆర్ హక్కులు కలిగి ఉన్న రైతులు తమ పోడు లో పంట రక్షణకు బోరు బావులు తీయించుకున్నారని, విద్యుత్ శాఖకు డీడీలు చెల్లించి కలెక్షన్ కూడా మంజూరు చేయించుకున్నట్లు వినతిలో తెలిపారు. పోడులో విద్యుత్తు లైన్ వేయటానికి తప్పనిసరిగా అటవీ శాఖ అనుమతులు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారని దీనికి అటవీశాఖ అనుమతులు లెక్కించేలా కృషి చేయాలని పూజారులు ఎమ్మెల్యేలు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అనుమతులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం మండల కార్యదర్శి కె నరేంద్ర, పోడు రైతులు రాఘవులు, బాపనయ్య, బాలకృష్ణ, నిర్మల, పుతిలి తదితరులు పాల్గొన్నారు.

# భావితరాల భవిష్యత్తును తాకట్టు పెట్టిన తహశీల్దార్..?

* కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి..
* కూకట్ పల్లి ప్రభుత్వ భూమి సర్వే నెం.336 కబ్జా..
* గురుకుల పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణం.
* భవన నిర్మాణ అనుమతులు మంజూరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు..
* స్థానిక నాయకుల సహకారంతో అక్రమ నిర్మాణం



కూకట్ పల్లి,నేడున్యూస్: కూకట్పల్లి సర్కిల్24లోని అల్విన్ కాలనీ డివిజన్,ధరణి నగర్లోని ప్రభుత్వ భూమి సర్వే నెం.336 ప్రభుత్వ భూమిలో అక్రమంగా బహుళ అతస్తుల నిర్మాణం జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.వివరాలలోకి వెళ్తే సర్వే నెం.336లోని ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసి ప్రక్కనే ఉన్న సర్వే నెం.322, వేసి ప్లాట్ నెం.212, 213 అని దొంగ పత్రాలు సృష్టించి. 2022 భవన నిర్మాణం కోసం మల్లికార్జున రావు పేరుతో దరఖాస్తు చేసుకోగా పత్రాలను పరిశీలించిన అప్పటి నిజాయితీ గల మున్సిపల్ అధికారులు దరఖాస్తును తిరస్కరించడం జరిగింది.కాని ప్రస్తుతం ఉన్న అధికారులు సెక్షన్ ఆఫీసర్ సోమేశ్ కుమార్,ఉప కమిషనర్,లంచాలకు అలవాటుపడి అక్రమార్కులకు సహకరించడం పై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఉప కమిషనర్,సెక్షన్ ఆఫీసర్ సోమేశ్ కుమార్,పై చర్యలు తీసుకోవాలని సరైన పత్రాలు లేకున్నా అనుమతులు మంజూరు చేసిన అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఇలాంటి ఉద్యోగులను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం నుండి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### కాసులకు అమ్ముడుపోయిన అధికారులు...??

గతంలో నిర్మాణ అనుమతులు తిరస్కరించిన ప్రభుత్వ స్థలంలో ఇప్పుడు మున్సిపల్ అధికారులు అనుమతులు మంజూరు చేయడంతో మున్సిపల్ అధికారులు కాసులకు కక్కుర్తి పడి కబ్జాదారులకు అమ్ముడుపోయారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల నుండి ఎలాంటి సంప్రదింపులు లేకుండా అనుమతులు ఎలా మంజూరు చేశారన్న విషయం ఇప్పుడు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతుంది. కాసులకు కక్కుర్తి పడి అనుమతులకు సమర్పించిన పత్రాలను కనీసం పరిశీలించకుండా అనుమతులు జారీ చేయడం వాటిని రక్షించడమే లక్ష్యంగా స్థానిక కుకట్పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్టు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల ప్రవర్తన చూస్తుంటే కూకట్పల్లి సర్కిల్ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకొని కూకట్పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం ఉప కమిషనర్ సెక్షన్ ఆఫీసర్ సోమేశ్ కుమార్ లపై చర్యలు తీసుకోవాలని వీరిపై కఠినమైన శిక్షలు విధించాలని స్థానికులు కోరుతున్నారు.

### గురుకుల పాఠశాల కోసం కేటాయింపు:

ఈ స్థలం కబ్జాకు గురౌతుతుందని గతంలో స్థానికులు పిర్యాదు చేయడంలో అప్పుడున్న తహసిల్దార్ నరసింహ రెడ్డి ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేసి సంక్షేమ సంఘం వారి కోరిక మేరకు ఈ స్థలాన్ని గురుకుల పాఠశాల నిర్మాణం కోసం కేటాయించబడినప్పటికీ, ప్రైవేటు వ్యక్తులు బోర్డును తొలగించి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారు.గత తహసిల్దార్ ప్రభుత్వ భూమిగా గుర్తించి ప్రభుత్వ గురుకుల పాఠశాలకు కేటాయించినప్పటికీ ప్రస్తుత తహసిల్దార్ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంపై స్థానికంగా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఇక్కడ ప్రభుత్వ భూమిలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలన్న గత తహసిల్దార్ ఆలోచన గొప్పగా ఉన్నప్పటికీ ప్రస్తుత తహసిల్దార్ ఈ స్థలాన్ని అక్రమార్కులు ఆక్రమిస్తూ ఉంటే చూసి చూడనట్టు వదిలేయడం రెవెన్యూ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. గత తహసిల్దార్ గురుకుల పాఠశాల కోసం ఏర్పాటుచేసిన స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడి పేద మధ్యతరగతి కుటుంబాలకు అనువుగా ఉండే గురుకుల పాఠశాల కేటాయించాలని ప్రస్తుత తాసిల్దార్ ఆదేశాలు జారీ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### పిర్యాదులపై స్పందించని కూకట్ పల్లి తహసిల్దార్..

స్థానికులు ఈ అక్రమ నిర్మాణంపై 2025 మార్చి 15న కూకట్పల్లి మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెవిన్యూ అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ భూమి గురుకుల పాఠశాల కోసం కేటాయించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణం కొనసాగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ విభాగంలో ఎక్కడా లేని విధంగా కూకట్పల్లి మండలం రెవెన్యూ అధికారులు ప్రవర్తిస్తున్నారు. గత తాసిల్దార్ ఇది ప్రభుత్వ భూమిని నిర్ణయించాడు. ప్రస్తుత తాసిల్దార్ మాత్రం ప్రభుత్వ భూమి అన్యాకృతం అవుతుంటే దానికి వత్తాసు పలకడం విడ్డూరం. ఇది ప్రభుత్వ భూమి అని గత తహసిల్దార్ నిర్ణయించాడు తప్పుడు సర్వే నంబర్లు వేసి ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు అని ఫిర్యాదులు చేసిన ప్రస్తుత రెవెన్యూ అధికారి కూకట్పల్లి మండలం తహసిల్దార్ మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరించడంపై కూకట్పల్లి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అధికారులు ఉన్నా లేకున్నా ఒకటే అన్నట్టు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడవలసిన అధికారులే ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తున్నారు అంటూ తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

### భావితరాల భవిష్యత్తు ను తాకట్టు పెట్టిన తహసిల్దార్..?

'ఈ భూమి భావితరాల భవిష్యత్తు కోసం గురుకుల పాఠశాల నిర్మాణానికి కేటాయించబడింది.

అలాంటి భూమిని కొందరు కబ్జాదారులు కొందరు నాయకుల అండదండలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి భవనం నిర్మిస్తున్నారు.అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు,అని ధరణి నగర్కు చెందిన స్థానికులు వాపోయారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడవలసిన అధికారులే ప్రభుత్వానికి వెన్నుపోటు పొడుస్తూ. ప్రభుత్వ స్కూళ్లను, పేద విద్యార్థులను ప్రోత్సహించవలసిన ప్రభుత్వ అధికారులే ప్రభుత్వ గురుకుల స్కూళ్లకు కేటాయించిన స్థలాలను అక్రమార్కులు ఆక్రమిస్తుంటే వాటిని నివారించాల్సిన అధికారులే అక్రమార్కులకు సహకరించడం పై రెవెన్యూ అధికారులపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లంచాలకు అలవాటుపడ్డ అవినీతి అధికారులపై తక్షణమే జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి అవినీతి అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని. ప్రభుత్వ భూమిలో నిర్మా ణం అవుతున్న ఈ అక్రమ కట్టడాన్ని కూల్చివేసి ప్రభుత్వ గురుకులపాఠశాల నిర్మించాలని కూకట్పల్లి ప్రజలు కోరుతున్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

* పాలకుల నిర్లక్ష్యంపై పోరాటానికి సిద్ధం కావాలి
* టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



కామారెడ్డి, నేడు న్యూస్: రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల విషయంలో పాలకులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోరాటానికి జర్నలిస్టులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలోని వశిష్ట కాలేజీలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభ జిల్లా కన్వీనర్ కృష్ణమాచారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని, ఇళ్ళ స్థలాల విషయంలో చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యల ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై పాత్రికేయుల పోరాటం తప్పదని అన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టు యూనియన్ గా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఒక్కటే జర్నలిస్టులకు అండగా ఉంటూ సమస్యలపై పోరాడుతుందని అన్నారు. రాను రాను జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలు పట్టించుకోక, మరోవైపు దాడులు,అవమానాలు పెరిగిపోతున్నాయని సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ పాలకుల పక్షం కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంగ్ర నవీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, తాటికొండ కృష్ణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నా రు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలను పరిష్కరించాల్సివుందని, హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ జరుపబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఫెడరేషన్ జిల్లా నాయకులు కృష్ణమూర్తి, మోహన్, బి. ప్రవీణ్ గౌడ్, కరుణాకర్, జమాల్ పూర్ లక్ష్మ ణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గం కార్యవర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షుడుగా బి. ప్రవీణ్ గౌడ్, కార్యదర్శిగా కె.కరుణాకర్, ఉపాధ్యక్షులుగా జమాల్ పూర్ లక్ష్మ ణ్, తిరుపతిరెడ్డి, బి.రాకేష్, సంయుక్త కార్యదర్శులుగా సుంకరి సంజీవ్, మామిండ్ల లింగం, కోశాధికారిగా పి.రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా చొప్పదండి స్వాతి, బల్వంత రావు, ధనావత్ రాము తదితరులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



మెదక్ టౌన్, నేడు న్యూస్: బిఅర్ఎస్ పార్టీ రజతోత్సవ సందర్భంగా మెదక్ బిఅర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణంలో పార్టీ జెండాను మెదక్ బిఅర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం.పద్మాదేవేందర్ రెడ్డి,మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్. మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టి జగపతి, కృష్ణారెడ్డి, పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, బిఅర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు.మెదక్ జిల్లా ప్రజలందరికీ బిఅర్ఎస్ కుటుంబ సభ్యులకు, ఉద్యమకారులకు, కార్యకర్తలకు నాయకులకు అందరికీ బిఅర్ఎస్ పార్టీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట సాధన కోసం ఎంతో మంది అమరులు అయ్యారని వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాలని ఉద్యమ నేత రథసారధి కేసీఆర్ గారు బిఅర్ఎస్ స్థాపించారు. ఎన్నో ఏళ్ల పోరాటంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం లక్ష్యం నెరవేరింది అన్నారు. రాష్ట్రం సిద్ధించాక కేసీఆర్ గారి నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమైంది, 10 ఏళ్లలో బిఅర్ఎస్ ఎన్నో సమస్యలను పరిష్కరించింది. ప్రజల గుండెల్లో బిఅర్ఎస్ నిలిచిపోయిందన్నారు.రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలబెట్టారన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీనీ కబంధ అస్తల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎండగడుతూ బిఅర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ లు మల్లికార్జున్ గౌడ్,బట్టి జగపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, కో కన్వీనర్లు కృష్ణ గౌడ్,లింగారెడ్డి జుబేర్, మాజీ కౌన్సిలర్లు జయరాజ్, ఆరోగ్య శ్రీనివాస్, చంద్రకళ రవి,నాయకులు అంజా గౌడ్,కిష్టయ్య,మోచి. కిషన్, సాదిక్ అలీ, శంకర్, మధు, శ్రీకాంత్, సంతోష్, నరేష్, గోపాల్, గోపాలకృష్ణ,లక్ష్మ ణ్, శ్రీనివాస్ గట్టేష్, ఫాజిల్, ఇస్మాయిల్, అమీర్, దశరథం అరుణ్ లడ్డు రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలు



పీర్జాదిగూడలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి

పీర్జాదిగూడ, నేడు న్యూస్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలు పీర్జాదిగూడ నగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు డివిజన్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. రజతోత్సవ సంబరాల్లో భాగంగా పీర్జాదిగూడ నగర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో గ్రామ గ్రామాన బీఆర్ఎస్ పార్టీ నూతన ఉత్తేజంతో ముందుకు సాగుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయ ఢంకా మోగించి తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి అవడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావెద్ ఖాన్, రఘువర్ధన్ రెడ్డి, గంగులు, మల్లం వెంకటేష్ గౌడ్, పైల్ల ప్రభాకర్ రెడ్డి, జక్కు క్రాంతి, కే. నిర్మల, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దళిత మహిళల వైద్యాన్నికి ఆర్థిక సహాయం

దళిత బిడ్డ కోసం దాతలు ముందుకు రావాలి

ఎంపీటీసీ దారా సురేష్

కోట, నేడు న్యూస్:పట్టణంలోని దళితవాడకు చెందిన టైలర్ యర్రమతి వెంకటేశ్వర్లు కుమార్తె అరుణ జ్యోతి ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె వైద్యానికి లక్షల రూపాయలు అవసరమని వైద్యులు చెప్పడంతో దిక్కు తోచని స్థితిలో ఆ నిరుపేద కుటుంబం దాతల సహాయం కోరుతున్నారు. స్పందించిన దాతలు ఆ దళిత బిడ్డకు తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. స్థానిక మండల టీడీపీ మైనారిటీ నాయకుడు షేక్ జలీల్ అహ్మద్ రూ.10 వేలు అందజేయగా, ఎంపీటీసీ దారా సురేష్ రూ. 5 వేలు అందజేశారు. మరి కొంతమంది దాతలు తమ వంతు సహాయాన్ని అందజేస్తే తన కూతురు బ్రతుకుతుందని ఆ నిరుపేద కుటుంబం దాతల సహాయాన్ని కోరుతున్నారు.



# మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం

* బిఆర్ఎస్ సీనియర్ నేత మద్దుల శ్రీనివాస్ రెడ్డి



మేడ్చల్ నేడు న్యూస్ బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నేత, గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బిఆర్ ఎస్ రజతోత్సవాల సందర్భంగా గుండ్ల పోచంపల్లి లోని మినీ ట్యాంక్ బండ్ పై బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మద్దుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సంవత్సరంలోపే ప్రజల మన్ననలను కోల్పోయిందని దుయ్యబట్టారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నే కోరుకుంటున్నారని, పదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రాష్ట్రాన్ని దివాలా తీస్తుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒకటి రెండు తప్ప మిగతా వాటిని పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మాజీ కౌన్సిలర్లు అమరం హేమంత్ రెడ్డి, అమరం జైపాల్ రెడ్డి, బేరి బాలరాజ్, పెంటయ్య, మాజీ ఎంపీపీ జగన్ రెడ్డి మాజీ సర్పంచులు రాగ జ్యోతి, గణేష్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ బీఆర్ఎస్ రాజాతోస్త్సావా సభ కు తరలివెల్లిన గులాబీ శ్రేణులు



బాన్సువాడ,నేడున్యూస్:బాన్సువాడ నియోజకవర్గం నుండి వరంగల్ బీఆర్ఎస్ రాజాతోస్త్సావా సభ కు తరలివెల్లిన గులాబీ శ్రేణులు. బస్సు లు అధ్యకు తీసుకొని గులాబీ బీఆర్ఎస్ కార్యక్రతలకు బస్సు ల్లో తరలించారు. వారి సొంత కార్లల్లో ఇతర వాహనాలలో సైతం నాయకులు బయలుదేరారు. ఈ సందర్బంగా బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనాతో ప్రజలు విసికిపోయారని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆధ్వర్యంలో తిరిగి రాష్ట్రములో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ, మున్సిపల్ వైస్ చెర్మన్ షేక్ జుబేర్, మొచి గణేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత సఫాయి మజ్దూర్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షులుగా సోదా రామకృష్ణ



పరకాల,నేడున్యూస్: ఈనెల 26వ తేదీన మహారాష్ట్రలోని నాగపూర్ లో జరిగిన ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్( కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్) జాతీయస్థాయి ఎన్నికలు జరగగా ఈ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఉపాధ్యక్షులుగా సోదా రామకృష్ణ వాల్మీకి ఎన్నికైనారు. తనను ఆల్ ఇండియా ఉపాధ్యక్షులుగా నియమించిన జాతీయ అధ్యక్షులు చరణ్ సింగ్ ఠాగూర్ , సహకరించిన ప్రతి ఒక్కరికి రామకృష్ణ వాల్మీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ పర్చా, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన చల్లా



నడికుడా,నేడున్యూస్: హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం నడికూడ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుక సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి .ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధన్నూర్ గ్రామంలో డా:బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు




మద్నూర్,నేడు న్యూస్: ధన్నూర్ గ్రామంలో డా: బిఆర్ అంబేద్కర్ 134 వ పుట్టిన రోజును పురస్కరించుకుని. భీమ్ జయంతి కార్యక్రమం ఘనంగా జరుపుకోవడం జరిగింది, కార్యక్రమం లో గ్రామ పెద్దలు ,జై భీమ్ యూత్ వారు మరియు గ్రామ ప్రజలు సంతోషంగా పాల్గొనడం జరిగింది. జయంతి కార్యక్రమంలో పెద్దలు మాజీ సర్పంచ్ దేవిదాస్ పటేల్ మరియు ప్రకాష్ పటేల్,మధుకర్ పటేల్, అథితులుగా వచ్చిన రాహుల్ వాగ్మారే, ముగులజీ వాగ్మారే, సురేష్ మనకరే, మాట్లాడుతూ. డా:బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాగం ద్వారా దేశ ప్రజలను ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛ, సౌభ్రాతుత్వం, సమానత్వం ఇవ్వడం జరిగిందని గుర్తుచేయడం జరిగింది. ప్రజలందరూ హక్కులు అనుభవిస్తూ బాధ్యతగా మెలగాలని కోరడం జరిగింది.కార్యక్రమంలో జై భీమ్ అసోసియేషన్ దిగంబర్ సంకే, నర్సింగ్ సక్వాల్ డా:దేవిదాస్ సక్వాల్, మిలింద, సంగ్రామ్ సంకే, దేవిదాస్ సక్వాల్, అనిల్ సక్వాల్, మాధవ్ సంకే. పాల్గొనడం జరిగింది.

## ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారు

బీఆర్ఎస్ పార్టీనే ప్రజలు కోరుకుంటున్నారు

సర్పంచ్ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి




మొయినాబాద్, నేడున్యూస్: కేసీఆర్ పరిపాలన గ్రామాలతో పాటు మున్సిపాలిటీలలో ఆదర్శంగా ఉందని ప్రజలు కేసీఆర్ పరిపాలన కోరుకుంటున్నారని సర్పంచ్ల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంపల్లి అనంతరెడ్డిలు అన్నారు. వరంగల్ కేసీఆర్ సభకు ఆదివారం గ్రామ గ్రామాల నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించిన నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి తరలివెళ్లారు. దీంతో గ్రామాల్లో గులాబీ మయం మారింది. జెండా పండుగతో నాయకులు, కార్యకర్తలు గ్రామాల ప్రజలతో పండుగ ఉత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వార్డుసభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, అఖిల భారత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవియాదవ్, శ్యామ్ రావు, శ్రీ హరియాదవ్, మండల విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షులు నర్సింహ్మాచారి, మాజీ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, సైపాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు జెండా పండుగ నిర్వహించుకోని భారీగా తరలివెళ్లారు.

# క్రికెట్ గ్రౌండ్‌పై విచారణ ఉన్నట్లా? లేనట్లా?

* డిపిఓ కు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం

* విచారణ చేయకపోవడంలో మతలబ్ ఏంటి

* క్రికెట్ గ్రౌండ్ ఇల్లీగల్ అని తెలిసిన విచారణ చేయరా అంటూ స్థానికుల ఆరోపణ



మేడ్చల్,నేడున్యూస్: మేడ్చల్ మండలం డబిల్ పూర్ గ్రామంలో ని భారత్ బైబిల్ కళాశాల ( బి బి సి ) కు చెందిన క్రికెట్ గ్రౌండ్ పై విచారణ జాప్యం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీబీసీ బైలాస్ ప్రకారం సొసైటీకి చెందిన స్థలాన్ని కమర్షియల్ కోసం వాడొద్దు అన్న నిబంధనలు ఉన్నప్పటికీ సొసైటీ స్థలాన్ని క్రికెట్ గ్రౌండ్ గా ఉపయోగించి బెట్టింగులకు ఇస్తున్నారు అంటూ పలువురు డిపిఓ కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఈ క్రికెట్ గ్రౌండ్ పై విచారణ జరుపుతామని ఎంపీ ఓ సునీత సైతం ప్రకటించింది. అయితే రోజులు గడిచిపోతున్న ఈ క్రికెట్ గ్రౌండ్ పై విచారణ మాత్రం చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రికెట్ గ్రౌండ్లో మాత్రం శని, ఆదివారాలలో బెట్టింగ్ మ్యాచులు సాగుతూనే ఉన్నాయి.

### నాలుగు ఎకరాలలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు

బీబీసీ సొసైటీ కి చెందిన నాలుగెకరాల స్థలంలో క్రికెట్ గ్రౌండ్ ను ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా సొసైటీ కి సంబంధం లేని వ్యక్తి క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేసి క్రికెట్ గ్రౌండ్ కిరాయికి ఇస్తూ బెట్టింగ్ ల కు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిజానికి సొసైటీ కి సంబంధించిన ఈ స్థలాన్ని కమర్షియల్ అవసరాలకు వాడుకోవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ వాటికి విరుద్ధంగా క్రికెట్ గ్రౌండ్ ను తయారు చేసి కమర్షియల్ యాక్టివిటీస్ కు వాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా వ్యవసాయ భూమి అయిన ఈ స్థలాన్ని నాలా కింద కన్వర్షన్ చేయకుండానే క్రికెట్ గ్రౌండ్ ను ఏర్పాటుచేసి అక్రమాలకు పాల్పడుతున్నారు అంటూ డిపిఓ కు ఫిర్యాదు చేశారు. అయితే డిపిఓ ఆదేశాల మేరకు విచారణ చేపడతామన్న ఎంపీ ఓ సునీత క్రికెట్ గ్రౌండ్ వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీబీసీ కి ఈ క్రికెట్ గ్రౌండ్ పై విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మాలతీ



మొయినాబాద్, నేడు న్యూస్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 202526 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ధరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మాలతీ తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి మార్కుల ఆధారంగా పూర్తి చేసిన విద్యార్థిణి, విద్యార్థులందరూ ఆన్లైన్ వెబ్సైట్లో సందర్శించి ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో ప్రవేశానికి ఎంపిక చేపడుతుందని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈ ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి చివరి తేదీ మే 15 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని గురుకులాల సొసైటీ కార్యదర్శి వర్షిణి ఆదేశాల మేరకు ధరఖాస్తుల స్వీకరణ తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ధరఖాస్తు ప్రక్రియను కళాశాలలో ప్రవేశాన్ని కల్పిస్తున్న అవకాశాన్ని పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిణిలు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ మాలతీ పేర్కొన్నారు.

# 139వ మేడే పోస్టర్ల ఆవిష్కరణ





* టియుసిఐ పిలుపుతో కార్మికుల హక్కుల కోసం పోరాటాన్ని ముమ్మరం చేద్దాం.

కారేపల్లి నేడు న్యూస్. కారేపల్లి ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం టేకులగూడెం గ్రామంలో 139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టియుసిఐ కారేపల్లి ఏరియా అధ్యక్షుడు జోగ నాగేశ్వరరావు, కార్యదర్శి ధరవత్ సక్రు నాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న 47 కోట్ల శ్రమజీవులలో కేవలం 7 కోట్ల మందికే ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, తగిన వేతనాలు లభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా 40 కోట్ల మంది శ్రమజీవులు అసంఘటిత రంగాల్లో కనీస వేతనాలు లేకుండా, రక్షణలేకుండా పని చేస్తున్నారని తెలిపారు.

### కార్మిక చట్టాల కల్తీపై తీవ్ర విమర్శలు

పూర్వంలో కార్మికులు దీర్ఘకాల పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్ద్వారామంగా తొలగించిందని, మిగతా 29 చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా మారుస్తూ కార్మిక వర్గాన్ని కార్పొరేట్ శక్తుల బానిసలుగా మార్చే కుట్ర చేస్తున్నదని టియుసిఐ నేతలు విమర్శించారు.

### లేబర్ కోడ్ల రద్దు టియుసిఐ డిమాండ్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్లను తక్షణమే నిలిపివేయాలని, పని గంటల పెంపుదల కార్మికులకు తీవ్ర అన్యాయమని టియుసిఐ నాయకులు స్పష్టంచేశారు. మేడే స్ఫూర్తితో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, 'సమాన పనికి సమాన వేతనం', ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కోసం ఉద్యమాన్ని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు సంఘటితంగా తిరగబడి, తమ హక్కుల కోసం నిరంతర పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

### మేడే ఉత్సవాల విలువను గుర్తించాలి

139 ఏళ్ల మేడే చరిత్రలో కార్మికుల పోరాటాలు, బలిదానాలు స్ఫూర్తిదాయకమని టియుసిఐ పేర్కొంది. 8 గంటల పని దినానికి బదులుగా ఇప్పుడు 12 గంటల పని పద్ధతిని తెస్తున్న దానిని తీవ్రంగా ఖండించారు. ఇది కార్మిక హక్కులపై దాడి మాత్రమే కాకుండా, వారిని మానవ హక్కుల నుండి కూడా దూరం చేసే చర్యగా అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ నాయకులు రాములు, రామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# వరంగల్ సభకు వెళ్లిన బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు



నేడు న్యూస్, మద్నూర్ : జిల్లా మాజీ ఎమ్మెల్యే కాయంరెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్కు 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ నాయకత్వమే ముఖ్యమని, ఆయన నాయకత్వంలో పనిచేయడం గర్వించదగ్గ విషయమన్నారు.

ఆదివారం ఉదయం డోంగ్లి గ్రామ పరిధిలోని మేనూరుచౌకలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో జరిగిన చలో వరంగల్ కార్యక్రమంలో భాగంగా డోంగ్లి, మదనూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు వరంగల్ సభకు చేరుకున్నారు. హన్మంత్ షిండే కార్మికులకు మార్గనిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సమావేశాలకు పార్టీ నాయకులు, అభిమానులు పెద్దఎత్తున హాజరయ్యారన్నారు. ఈసారి గోవింద్ పటేల్, కంచిన్వార్ హన్మండలు, దర్బార్ సురేష్, గఫర్సాబ్, బన్సీ పటేల్ హాజరయ్యారు.

# సివిల్స్‌లోనే కాదు సైన్యంలోనూ రాణిస్తాం



భారత సైన్యంలో చేరేందుకు యువతుల ఆసక్తి గంటల తరబడి గ్రౌండ్లో శ్రమిస్తున్న యువతులు దేశ భద్రతలో తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్న తెలంగాణ అమ్మాయిలు

నేటితరం యువతలో భారత సైన్యంలో చేరాలనే ఆసక్తి రోజురోజుకీ పెరుగుతూ వస్తోంది. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఎస్ఎస్బీ, అగ్నివీర్లుగా ఎంపిక అవ్వాలని చాలామంది అనుకుంటున్నారు. అదే తమ జీవిత లక్ష్యంగా ఎంతో మంది యువత సాధన చేస్తున్నారు. కొందరు భద్రతా దళాల్లో చేరిన వారిని ప్రేరణగా తీసుకుని మరింత మంది సైన్యంలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. వీరిలో కొంత మంది డిఫెన్స్ అకాడమీలలో చేరుతున్నారు.అక్కడ దేహదారుఢ్య పరీక్షలో నెగ్గేందుకు మైదానంలో శ్రమిస్తూ సైనిక దుస్తులు ధరించి దేశ సరిహద్దుల్లో కాపలా కాయాలని దృఢంగా సంకల్పించుకుంటున్నారు. యువకులతో పాటు యువతులు కూడా వారితో సమానంగా సాధన చేస్తూ సిద్ధమవుతున్నారు. ఆదిలాబాద్లో ఇందిర ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో నిత్యం యువతులు సాధన చేస్తున్నారు. వారిలో కొందరి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

కసరత్తు చేస్తున్న యువతులు

దేశానికి సేవ చేయాలనేదే లక్ష్యం : నా పేరు జక్కుల లక్ష్మి . మాది జైనథ్ మండలం బాలాపూర్. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నా. ఇటీవల ఎన్సీసీలో సీ ధ్రువపత్రం సాధించా. దేశానికి సేవ చేయాలనేదే నా లక్ష్యం. కానిస్టేబుల్, అగ్నివీర్, ఎస్సెస్సీ జీడీ(స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జనరల్ డ్యూటీ) కోసం సిద్ధమవుతున్నాను.రోజూ మూడేసి గంటల చొప్పున సాధన : నా పేరు పడకంటి కల్యాణి. మాది బేల మండలం సాంగిడి. ఇంటర్ పూర్తి చేశాను. గౌరవప్రదమైన సైనిక ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నాను. అగ్నివీర్ ఆర్మీ ర్యాలీలో పరుగు, బ్యాలెన్సింగ్, డిచ్ వంటి దేహదారుఢ్య పరీక్షల్లో నెగ్గేందుకు మైదానంలో శిక్షకుడి పర్యవేక్షణలో రోజూ మూడేసి గంటలు సాధన చేస్తున్నాను.యువకులతో సమానంగా శిక్షణ : త్రివిధ దళాల్లో చేరాలని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని మైదానాలు యువతతో కళకళలాడుతున్నాయి. దేహదారుఢ్యం సాధన కోసం యువకులతో సమానంగా యువతులు శిక్షణ పొందుతున్నారు. పరుగు, జిగ్‌జాగ్ బ్యాలెన్సింగ్, డిచ్ వంటి అంశాల్లో తీవ్రంగా సాధన చేస్తున్నారు.సైన్యంలో చేరాలన్నదే కల : నా పేరు ఆత్రం శ్రావణి. మాది కుమురం భీం జిల్లా గోయెగాం. డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నాను. సైన్యంలో చేరాలనేది చిన్నప్పటి కల. అగ్నివీర్ ర్యాలీలో పాల్గొని ఉద్యోగం సాధిస్తా. నా కలను నిజం చేసుకుంటా. 800 మీటర్ల పరుగును 3 నిమిషాల్లో పూర్తి చేస్తున్నాను. మరింత సాధన చేసి తక్కువ సమయంలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాను.రాతపరీక్ష లేకుండానే సైన్యంలో చేరాను : ఈ యువతి పేరు రాథోడ్ స్వాతి. నిర్మల్ జిల్లా కుభీరు మండలం. డిగ్రీ రెండో ఏడాది చదువుతోంది. ఓ కార్యక్రమానికి ఆర్మీ జవాను రావడంతో ఆయనకు సెల్యూట్ చేశారు. సైన్యంలో చేరాలని, సైనిక దుస్తులు ధరించాలని తన చిన్ననాటి ఆకాంక్షను ఆయనతో పంచుకున్నారు. ఆయన సూచనలతో ఉషూ ఆటలో శిక్షణ పొందారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించారు. క్రీడా విభాగంలో సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్బీ) నిర్వహించిన ర్యాలీలో దేహదారుఢ్య పరీక్షలో నెగ్గారు. రాత పరీక్ష లేకుండానే క్రీడా విభాగంలో ఎస్ఎస్బీలో ఉద్యోగం సాధించి, నల్గొండలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఢిల్లీలో విధుల్లో చేరాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.

## కారేపల్లిలో బీఆర్ఎస్ వాహన ర్యాలీ

రజత్తోత్సవ సభకు తరలి వెళ్లిన నాయకులు.



కారేపల్లి,నేడున్యూస్. బి ఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ఆదివారం ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కారేపల్లి లో వాహనాలతో ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీని టిఆర్ఎస్ వైరా నియోజకవర్గ కన్వీనర్ లాకావత్ గిరిబాబు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ ప్రారంభించారు పోలంపల్లి తండా ఉసిరికాయలపల్లి భాగ్యనగర్ తండా కెసిఆర్ పై నమ్మకం కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మహా సభలో ప్రతిబింబించనున్నట్లు వారు తెలిపారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగే మహాసభకు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,కేసీఆర్ అభిమానులు, సామాన్య ప్రజలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ జడ్పిటిసిలు వాంకుడోత్ జగన్, ఉన్నం వీరేందర్, నాయకులు షేక్ గౌసుద్దీన్, జడల వెంకటేశ్వర్లు, అడప పుల్లారావు, బానోత్ కుమార్ గుగులోత్ సక్రు మాలోత్ రాజాసింగ్ తిరుపతిరావు బ్రహ్మం హీరలాల్ రాంబాబు అనిల్ రవి భద్రు తదితరులు ఉన్నారు.

## మత్స్యసహకార సంఘం అభివృద్ధికి భద్రు కృషి

దుబ్బతండాలో లావుడ్యా భద్రు సంస్మరణ సభ



కారేపల్లి నేడు న్యూస్. సింగరేణి మండలం దుబ్బతండా మత్స్య సహకార సంఘం 2011 నుండి అమరజీవి లావుడ్య భద్రు కృషితో అభివృద్ధి పథంలో నడుస్తుందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర అన్నారు. ఆదివారం దుబ్బతండాలో జరిగిన భద్రు సంస్మరణ సభ మత్స్యసొసైటీ అధ్యక్షులు గుగులోత్ వీరు అధ్యక్షతన జరిగింది. ముందుగా భద్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ఈనెల 24వ తేదిన భద్రు మృతి చెందటం కుటుంబానికే కాక అందరిని కలచి వేసిందన్నారు. అందరు కలివిడిగా ఉంటూ ఎవరుకు కష్టమొచ్చినా తానున్నాంటు ముందే భద్రు మనలను శాశ్వతంగా విడిచి పోవటం బాధకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రతి ఒక్కరు అండగా ఉందామన్నారు. ఈకార్ర్యకమంలో మత్స్యసహకార సంఘం ఉపాధ్యక్షులు బానోత్ బావుసింగ్, ప్రధాన కార్యదర్శి బానోత్ హనుమా, సభ్యులు బానోతు లక్ష్మన్, బాలాజీ, పాల్తియా లాలు, బానోత్ రమేష్, భానోత్ శ్రీరాములు, బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పేహాల్గావ్ మృతులకు క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు





కూకట్ పల్లి: నేడు న్యూస్ జమ్మూ కాశ్మీర్లోని పేహాల్గావ్లో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించేందుకు కూకట్ పల్లిలోని ఉషా ముళ్ళపూడి కమాన్ వద్ద క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు ఉషా ముళ్ళపూడి కమాన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు కొవ్వొత్తులు వెలిగించి, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా, ఉగ్రవాదాన్ని ఖండిస్తూ, దేశ భద్రత కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న భద్రతా బలగాలకు మద్దతు తెలిపారు. మన జాతీయ జెండాను పట్టుకొని జై భారత్ అంటూ పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ పేహాల్గావ్ దాడి మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన దుర్మార్గమని, మృతుల కుటుంబాలకు మా సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం మేము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, యువకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని, బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు.

## రామప్ప ఆలయంలో మిస్ ఇండియా ప్రత్యేక పూజలు

యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని 2023 మిస్ ఇండియా విజేత నందిని గుప్తా శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. నందిని గుప్తా రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ నేతృత్వంలో టూరిజం గైడ్లు ఆమెకు రామప్ప ఆలయ చరిత్ర, రామప్పలోని మదనిక సాలబంజికల చరిత్రను వివరించారు. అద్భుత నిర్మాణ రీతులు, అపురూప శిల్ప సంపదకు నెలవైన రామప్ప ఆలయం జగద్విఖ్యాతం, కాకతీయుల నిర్మాణాల్లో తలమానికం.రాళ్లను కరిగించి పోతపోసి మలిచిన శిల్పాలను ఆమె ఆసక్తిగా తిలకించారు. అయితే మే 7 నుంచి 31 వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్ పోటీలు జరనుండగా ఈ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాల సుందరీమణులకు రాష్ట్రంలోని పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలను చూపేలా ప్రభుత్వం కార్యాచరణ చేసింది. అందులో భాగంగా మే 14న సుందరీమణులు రామప్పకు రానున్నారు. కానీ అంతకంటే ముందుగానే రాజస్థాన్కు చెందిన మిస్ఇండియా రామప్పను సందర్శించారు.

### అర్ధ శతకంతో చెలరేగిన కృనాల్ పాండ్యా..

కరుగుతున్న ఆర్సీబీ లక్ష్యం..!

: పవర్ ప్లేలో 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కోలుకుంది. ఆల్రౌండర్ కృనాల్ పాండ్యా(53) ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కీలక ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. క్రీజులో కుదురుకున్న కృనాల్.. బౌండరీతో అర్ధ శతకం సాధించాడు. ఈ ఎడిషన్లో అతడికి ఇదే తొలి ఫిఫ్టీ. 38 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో యాభైకి చేరువయ్యాడీ స్పిన్ ఆల్రౌండర్.ముకేశ్, కుల్దీప్ బౌలింగ్లో కళ్లు చెదిరే సిక్సర్లు బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్ హాఫ్ సెంచరీతో జట్టు విజయానికి బలమైన పునాది వేశాడు. మరో ఎండ్లో విరాట్ కోహ్లీ(41) యాంకరింగ్ రోల్ పోషిస్తున్నాడు. చివరిదాకా నిలబడాలనే ఉద్దేశంతో విరాట్ రిస్క్ తీసుకోవడం లేదు. 15 ఓవర్లకు ఆర్సీబీ స్కోర్.. 1143. ఇంకా ఢిల్లీ విజయానికి 49 రన్స్ కావాలంతే.ఢిల్లీ గడ్డపై రివెంజ్ మ్యాచ్ ఆడుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆదిలోనే కష్టాల్లో పడింది. అక్షర్ పటేల్ విజృంభణకు తోడు కరుణ్ నాయర్ ఖతర్నాక్ ఫీల్డింగ్ కారణంగా మూడు కీలక వికెట్లు కోల్పోయింది. అక్షర్ ఒకే ఓవర్లో ఓపెనర్ జాకబ్ బెథెమ్(12), ఇంప్యాక్ట్ ప్లేయర్ దేవ్దత్ పడిక్కల్(0)ను డకౌట్గా పెవిలియన్ పంపాడు. ఆ కాసేపటికే కెప్టెన్ రజత్ పాటిదార్(6) అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. దాంతో, 26 పరుగులకే బెంగళూరు జట్టు 3 ప్రధాన వికెట్లు పడ్డాయి.




# స్పోర్ట్స్

## పసిడి పతకంపై కన్నేసిన చైనా..!



ఒలింపిక్స్లో వందలకొద్దీ పతకాలు కొల్లగొట్టే దేశాలు చాలానే. అథ్లెటిక్స్ నుంచి టేబుల్ టెన్నిస్ వరకూ ప్రతి పోటీలో స్వర్ణం సాధించే ఆసియా దేశం చైనా ఈసారి క్రికెట్ మీద గురి పెట్టింది. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్వేదికగా జరుగబోయే విశ్వక్రీడల్లో ఏకంగా పసిడి పతకమే లక్ష్యంగా పెట్టుకుందట చైనా. అందుకోసం క్రికెట్ టీమ్ను సిద్ధం చేస్తోంట. ఈ విషయాన్ని ఆదివారం ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా వెల్లడించాడు.'దాదాపు శతాబ్దం తర్వాత క్రికెట్కు మళ్లీ ఒలింపిక్స్లో చోటు దక్కనుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించడమే ఆలస్యం అన్ని దేశాలు సన్నాహాల్లో మునిగిపోయాయి. ఆసియా దేశం చైనా కూడా క్రికెట్ టీమ్ను సిద్ధం చేసుకుంటోంది. ఈరోజుల్లో టీ20లకు ఆదరణ చాలా ఉంది. ఫ్రాంచైజ్ క్రికెట్ ద్వారా ఏటా వందల కోట్ల వ్యాపారం సాగుతోంది. ఈ టీ20 బిజినెస్ మరింత పెరగనుంది' అని స్టీవ్ వా తెలిపాడు.

ఆరేసి జట్లు విశ్వక్రీడల్లో 128 ఏళ్ల తర్వాత క్రికెట్ పునరాగమనం చేయనుంది. ప్రపంచవ్యాప్తంగా హిట్ అయిన టీ20 ఫార్మాట్లో మ్యాచ్లు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళల విభాగంలో ఆరేసి జట్లు స్వర్ణం కోసం పోటీపడనున్నాయి. దాంతో, అన్ని దేశాలు ఒలింపిక్ పతకంపై కోసం సన్నద్ధమవుతున్నాయి. ఒలింపిక్స్లో ప్రతి పోటీలో పతకాల పంట పండించే చైనా.. క్రికెట్ టీమ్తో గోల్ మెడల్ సాధిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. 2028లో జూలై 14న లాస్ ఏంజెల్స్లో ఒలిపింక్స్ పండుగ మొదలవ్వనుంది.

## మాల్దీవుల్లో గెలుపు సంబరాలు

### రిలాక్స్ అవుతున్న సన్రైజర్స్ ఆటగాళ్లు!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్లో సన్రైజర్స్ హైదరాబాద్ జట్టు ఎట్టకేలకు మూడో విజయాన్ని నమోదు చేసుకుని సంబరాల్లో మునిగిపోయింది. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ను ఓడించి, ప్లే ఆఫ్స్ రేసులో నిలబడింది. ఈ విజయాన్ని ప్యాట్ కమ్మిన్స్ సారథ్యంలోని సన్రైజర్స్ జట్టు ప్రకృతి అందాలకు నిలయమైన మాల్దీవుల్లో ఆస్వాదిస్తోంది.తదుపరి మ్యాచ్లో సన్రైజర్స్ హైదరాబాద్ మే 2న గుజరాత్ టైటాన్స్తో కీలక పోరులో తలపడనుంది. ఈ ముఖ్యమైన మ్యాచ్కు ఐదు రోజుల విరామం ఉండటంతో, ఆరెంజ్ ఆర్మీ ఆటగాళ్లంతా మాల్దీవులకు విహారయాత్రకు వెళ్లారు. జట్టులోని కీలక ఆటగాళ్లు ట్రావిస్ హెడ్ మరియు హెన్రిచ్ క్లాసెన్ తమ కుటుంబాలతో కలిసి ఈ విహారయాత్రలో పాల్గొన్నారు. మాల్దీవుల్లోని రిసార్ట్ నిర్వాహకులు సన్రైజర్స్ ఆటగాళ్లకు తమ సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు.కనుచూపు మేర నీలి సముద్రంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న మాల్దీవుల్లో హైదరాబాద్ క్రికెటర్లు సేదతీరుతున్న వీడియోను సన్రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తమ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. బిజీ షెడ్యూల్ నుండి విరామం లభించడంతో ఆటగాళ్లు రిలాక్స్ అవ్వాలనే ఉద్దేశంతోనే యాజమాన్యం ఈ ట్రిప్పు ఏర్పాటు చేసింది. వరుస మ్యాచ్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి ఈ విహారయాత్ర ఆటగాళ్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.గత 17వ సీజన్లో రికార్డు స్థాయి స్కోర్లతో అందరినీ అలరించిన సన్రైజర్స్ హైదరాబాద్ చివరకు రన్నరప్తో సరిపెట్టుకుంది. ఈ 18వ సీజన్లో రాజస్థాన్ రాయల్స్పై అద్భుతమైన విజయంతో టోర్నీని ఘనంగా ప్రారంభించింది. అయితే, ఆ తర్వాత వరుసగా ఓటములు చవిచూడటంతో అభిమానులను నిరాశపరిచింది. పంజాబ్ కింగ్స్పై విజయం సాధించడంతో మళ్లీ గాడిలో పడినట్టే కనిపించినా, ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ మరియు కోల్కతా నైట్ రైడర్స్ చేతిలో చిత్తుగా ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి చేరుకుంది.అయితే, అందరూ ఇక సన్రైజర్స్ పని అయిపోయిందనుకున్న సమయంలో, చెన్నై సూపర్ కింగ్స్ కంచుకోట అయిన చెపాక్లో అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి ప్లే ఆఫ్స్ రేసులోకి మళ్లీ వచ్చింది. 155 పరుగుల లక్ష్యాన్ని 5 వికెట్లు కోల్పోయి ఛేదించి, తమ ఖాతాలో ఆరు పాయింట్లు వేసుకుంది. ప్లే ఆఫ్స్కు చేరుకోవాలంటే సన్రైజర్స్ జట్టు మిగిలిన ఐదు మ్యాచ్లో తప్పకుండా గెలవాల్సిన పరిస్థితి ఉంది.ఏది ఏమైనప్పటికీ, చెన్నైపై సాధించిన విజయం జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ విజయాన్ని మాల్దీవుల్లో సెలబ్రేట్ చేసుకోవడం ఆటగాళ్లకు మరింత మానసిక బలాన్నిస్తుంది. గుజరాత్ టైటాన్స్తో జరిగే తదుపరి మ్యాచ్లో సన్రైజర్స్ ఇదే ఉత్సాహంతో బరిలోకి దిగి విజయం సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు. మాల్దీవుల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం ఆటగాళ్లకు మంచి విశ్రాంతిని ఇవ్వడంతో పాటు, రాబోయే కీలక మ్యాచ్లకు మరింత ఉత్సాహంతో సిద్ధమయ్యేలా చేస్తుందని భావిస్తున్నారు. సన్రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్లే ఆఫ్స్ రేసులో నిలబడుతుందో లేదో వేచి చూడాలి.



## గగనతల దాడులకు చెక్!




పహల్గామ్ ఉగ్రదాడి దేశవ్యాప్తంగా కలకలం రేపిన నేపథ్యంలో, భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయబడ్డాయి. ఈ నేపథ్యంలో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL)లో ఆటగాళ్ల భద్రత కోసం ఒక వినూత్నమైన ముందడుగు వేసింది. 'వజ్ర సూపర్ షాట్' అనే అత్యాధునిక యాంటీడ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ పరికరం మ్యాచ్ల సమయంలో డ్రోన్ల ద్వారా జరిగే గగనతల దాడులను సమర్థవంతంగా నిరోధించగలదని భావిస్తున్నారు.

'వజ్ర సూపర్ షాట్' అనేది ప్రత్యేకంగా రూపొందించిన యాంటీడ్రోన్ పరికరం. డ్రోన్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇది అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంది. విశేషం ఏమిటంటే, ఈ పరికరాన్ని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, భారతీయ ప్రైవేట్ కంపెనీ అయిన 'బిగ్ బాంగ్ బూమ్ సొల్యూషన్స్' అభివృద్ధి చేసింది. తేలికగా తీసుకువెళ్లగలిగేలా రూపొందించిన ఈ పరికరం, స్టేడియంలలో డ్రోన్ల ద్వారా జరిగే దాడులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు విశ్వసిస్తున్నారు. ఈ వ్యవస్థ నాలుగు కిలోమీటర్ల ఎత్తు వరకు ఉన్న శత్రు డ్రోన్లను గుర్తించగల సామర్థ్యం కలిగి ఉండటం విశేషం.

ఈ యాంటీడ్రోన్ వ్యవస్థ రేడియో సిగ్నల్స్ ద్వారా పని చేస్తుంది. 'వజ్ర సూపర్ షాట్' శక్తివంతమైన రేడియో తరంగాలను పంపడం ద్వారా అనుమానాస్పద డ్రోన్ల నియంత్రణను పూర్తిగా దెబ్బతీస్తుంది. ఫలితంగా, దుండగులు ఆ డ్రోన్ను ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అంతేకాకుండా, ఈ పరికరం నిర్వీర్యం చేసిన డ్రోన్లను తిరిగి తమ స్థానానికి చేరుకునేలా చేయగలదు. తద్వారా స్టేడియం పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచే ఒక భద్రతా కవచంగా ఇది పనిచేస్తుంది.

ఈ అత్యాధునిక 'వజ్ర సూపర్ షాట్' వ్యవస్థను మొట్ట మొదటిసారిగా ఏప్రిల్ 26న కోల్కతాలోని ఈడెన్ గార్డెన్స్లో జరిగిన కోల్కతా నైట్ రైడర్స్ మరియు పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్లో ఉపయోగించారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో, ప్రస్తుతం IPL మ్యాచ్లు జరుగుతున్న ప్రతి స్టేడియంలోనూ ఈ యాంటీడ్రోన్ పరికరాన్ని వినియోగిస్తున్నారు. ఆటగాళ్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న BCCI తీసుకున్న ఈ చర్య సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

భారతదేశంలో క్రీడా వేదికల భద్రత ఎల్లప్పుడూ ఒక ముఖ్యమైన అంశంగా పరిగణించబడుతుంది. ముఖ్యంగా IPL వంటి పెద్ద టోర్నమెంట్లలో, దేశ విదేశాల నుండి ఎంతో మంది ఆటగాళ్లు మరియు ప్రేక్షకులు పాల్గొంటారు. ఇలాంటి పరిస్థితుల్లో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటం చాలా కీలకం. పహల్గామ్ ఉగ్రదాడి వంటి ఘటనల నేపథ్యంలో, భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, BCCI తీసుకున్న ఈ 'వజ్ర సూపర్ షాట్' నిర్ణయం ఒక ముందస్తు మరియు సమర్థవంతమైన చర్యగా నిలుస్తుంది.

'బిగ్ బాంగ్ బూమ్ సొల్యూషన్స్' వంటి స్వదేశీ కంపెనీలు అత్యాధునిక భద్రతా సాంకేతికతను అభివృద్ధి చేయడం దేశానికి గర్వకారణం. ఇది కేవలం క్రీడా రంగంలోనే కాకుండా, ఇతర ముఖ్యమైన ప్రదేశాలు మరియు జాతీయ భద్రతా రంగంలో కూడా ఇలాంటి స్వదేశీ పరిజ్ఞానం ఉపయోగపడే అవకాశం ఉంది. 'వజ్ర సూపర్ షాట్' వంటి ఆవిష్కరణలు భారతదేశాన్ని సాంకేతిక రంగంలో మరింత ముందుకు తీసుకువెళ్తాయి అనడంలో సందేహం లేదు.

మొత్తానికి, IPL మ్యాచ్ల సందర్భంగా ఆటగాళ్ల భద్రతను పెంపొందించడానికి BCCI ప్రవేశపెట్టిన 'వజ్ర సూపర్ షాట్' ఒక విప్లవాత్మకమైన చర్య. ఇది డ్రోన్ల ద్వారా జరిగే సంభావ్య దాడులను నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించబడిన ఈ అత్యాధునిక వ్యవస్థ, భవిష్యత్తులో క్రీడా వేదికల భద్రతకు ఒక నూతన ప్రమాణాన్ని నెలకొల్పే అవకాశం ఉంది. క్రికెట్ అభిమానులు మరియు ఆటగాళ్లు ఈ భద్రతా చర్యతో మరింత నిర్భయంగా క్రీడానుభూతిని పొందగలరు.

## శ్రీలంకపై టీమిండియా ఘన విజయం




మహిళల వన్డే ప్రపంచ కప్పుకు సన్నద్ధమవుతున్న భారత మహిళల క్రికెట్ జట్టు ముక్కోణపు సిరీస్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఆతిథ్య శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్లో టీమిండియా ఏకంగా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శ్రీలంక నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యాన్ని భారత ఓపెనర్లు ప్రతీక రావల్ మరియు స్మృతి మంధాన ధాటిగా ఆడి సునాయాసంగా ఛేదించారు.వర్షం కారణంగా 39 ఓవర్లకు కుదించబడిన ఈ మ్యాచ్లో భారత బౌలర్లు మరియు బ్యాటర్లు సమష్టిగా రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టును భారత బౌలర్లు స్నేహ్ రానా మరియు నల్లపురెడ్డి రాణి తమ అద్భుతమైన బౌలింగ్తో వణికించారు. స్నేహ్ రానా 31 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టగా, రాణి 26 పరుగులిచ్చి 2 వికెట్లు తీసింది. శ్రీలంక ఓపెనర్ హాసినీ పెరీరా (30 పరుగులు) మరియు కవిష దిల్హరి (25 పరుగులు) కొంత ప్రతిఘటన చూపినప్పటికీ, మిగతా బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. దీంతో శ్రీలంక జట్టు నిర్ణీత ఓవర్లలో 148 పరుగులకే ఆలౌట్ అయింది.తర్వాత బ్యాటింగ్కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ప్రతీక రావల్ మరియు స్మృతి మంధాన శ్రీలంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ వేగంగా పరుగులు సాధించారు. ఈ జోడీ మొదటి వికెట్కు 54 పరుగులు జోడించి విజయం దిశగా జట్టును నడిపించింది. స్మృతి మంధాన 43 పరుగులు చేసి ఇనోకా రణవీర బౌలింగ్లో ఔటైనప్పటికీ, భారత జోరు తగ్గలేదు.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హర్లీన్ డియోల్ తన మెరుపు బ్యాటింగ్తో శ్రీలంక బౌలర్ల ఆశలను నీరుగార్చింది. ప్రతీక రావల్తో కలిసి రెండో వికెట్కు అజేయంగా 95 పరుగులు జోడించి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ప్రతీక రావల్ 50 పరుగులతో నాటౌట్గా నిలవగా, హర్లీన్ డియోల్ 48 పరుగులతో మెరుపులు మెరిపించింది. ఆమె ఇన్నింగ్స్లో నాలుగు అద్భుతమైన ఫోర్లు ఉన్నాయి. ఈ ఇద్దరి ధాటిగా ఆడటంతో భారత జట్టు మరో 9 ఓవర్లు మిగిలుండగానే విజయాన్ని సొంతం చేసుకుంది.ఈ మ్యాచ్లో భారత మహిళల జట్టు సమగ్ర ప్రదర్శన కనబరిచింది. బౌలింగ్లో స్నేహ్ రానా మరియు నల్లపురెడ్డి రాణి శ్రీలంక బ్యాటింగ్ను కుప్పకూల్చగా, బ్యాటింగ్లో ప్రతీక రావల్ మరియు స్మృతి మంధాన అద్భుతమైన ఆరంభాన్నిచ్చారు. హర్లీన్ డియోల్ తన మెరుపు ఇన్నింగ్స్తో విజయాన్ని సునాయాసం చేసింది. ఈ విజయం ప్రపంచ కప్పుకు ముందు భారత జట్టుకు ఎంతో ఉత్సాహాన్నిస్తుంది.ముక్కోణపు సిరీస్లో తమ తొలి మ్యాచ్లోనే ఘన విజయం సాధించిన భారత మహిళల జట్టు రాబోయే మ్యాచ్లోనూ ఇదే జోరును కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ విజయం జట్టులోని ప్రతి క్రీడాకారిణి యొక్క నైపుణ్యం మరియు సమష్టి కృషికి నిదర్శనం. ప్రపంచ కప్పుకు ముందు ఇలాంటి విజయాలు జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతాయి అనడంలో సందేహం లేదు. భారత మహిళల జట్టు తమ తదుపరి మ్యాచ్లోనూ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తుందని ఆశిద్దాం.

# ఒకప్పుడు ఎత్తు సమస్య..

టాలీవుడ్లో తక్కువ కాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న యంగ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఇటీవల టాలీవుడ్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్తో భారీ వసూళ్లను రాబట్టింది. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి తన అందం, అభినయంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమా మీనాక్షి కెరీర్కు మరింత ఊపునిచ్చిందని చెప్పవచ్చు.

అంతకుముందు మీనాక్షి చౌదరి 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలో అడుగు పెట్టింది. ఆ తర్వాత యంగ్ హీరో అడివి శేష్ హీరోగా నటించిన బ్లాక్బస్టర్ చిత్రం 'హిట్ 2'లో హీరోయిన్గా అవకాశం దక్కించుకుని తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో మీనాక్షికి టాలీవుడ్లో వరుస ఆఫర్లు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ వరుస సినిమాలతో బిజీగా గడుపుతోంది.వరుస బ్లాక్బస్టర్ హిట్లతో ప్రేక్షకులను అలరిస్తున్న మీనాక్షి చౌదరి, తాజాగా ఒక ప్రముఖ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన, కెరీర్ ఆరంభానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. చిన్నతనంలో తాను ఇతరులతో స్వేచ్ఛగా మాట్లాడటానికి చాలా ఇబ్బంది పడేదానినని మీనాక్షి చెప్పింది. కాలేజ్ రోజుల్లో తన ఎత్తు ఏకంగా 6.2 అడుగులు ఉండేదని, దానివల్ల చాలా మంది అమ్మాయిలతో పోలిస్తే తాను చాలా పొడవుగా కనిపించేదానినని తెలిపింది. తన అధిక ఎత్తు కారణంగా చాలా మంది తనతో మాట్లాడటానికి, స్నేహం చేయడానికి వెనుకడుగు వేసేవారని, అది తనను చాలా బాధించేదని మీనాక్షి తన బాధను వ్యక్తం చేసింది. ఆర్మీ అధికారి అయిన తన తండ్రికి ఈ విషయం గురించి చెబితే, ఆయన తన సమస్యను తానే పరిష్కరించుకోవాలని సూచించారని మీనాక్షి గుర్తు చేసుకుంది. తన తండ్రి ఇచ్చిన ఆ సలహా తన జీవితానికి ఒక మలుపు తిప్పిందని ఆమె తెలిపింది.ఆ కష్టమైన సమయంలో మీనాక్షి ఎక్కువగా పుస్తకాలను తన స్నేహితుల్లా భావించింది. పుస్తక పఠనంతో పాటు ఆమె అందాల పోటీల్లో కూడా పాల్గొంది. అంతేకాకుండా ఆటల పట్ల కూడా తనకున్న ఆసక్తిని పెంచుకుంది. సినీ పరిశ్రమలో వచ్చిన ప్రతి చిన్న అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటూ, తన నటనతో ప్రేక్షకులను మెప్పించడానికి సాధ్యమైనంత వరకు కష్టపడి పనిచేస్తున్నానని మీనాక్షి చెప్పింది. యంగ్ హీరో రవితేజ నటించిన 'ఖిలాడీ' సినిమాలో హీరోయిన్గా అవకాశం రావడానికి 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమానే కారణమని ఆమె వెల్లడించింది. సినీ పరిశ్రమలో వచ్చే ప్రతి చిన్న అవకాశం కూడా భవిష్యత్తులో కెరీర్ స్థిరపడటానికి ఎంతో ఉపయోగపడుతుందని తాను గట్టిగా నమ్ముతున్నానని మీనాక్షి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

సీనియర్ హీరోలతో నటించడానికి తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, దానిని తాను ఒక ప్రత్యేకమైన జోనర్గా భావిస్తానని మీనాక్షి స్పష్టం చేసింది. ప్రస్తుతం మీనాక్షి చౌదరి టాలెంటెడ్ యంగ్ హీరో నవీన్ పొలిశెట్టితో కలిసి 'అనగనగా ఒక రాజు' అనే రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్లో హీరోయిన్గా నటిస్తోంది. ఈ సినిమాపై కూడా మీనాక్షి చాలా ఆశలు పెట్టుకుంది. తన కెరీర్ ప్రారంభంలో అధిక ఎత్తు ఒక సమస్యగా మారినప్పటికీ, ఇప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉండటం ఆమె పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం. ఒకప్పుడు తన పొడవు గురించి బాధపడిన మీనాక్షి, ఇప్పుడు టాలీవుడ్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఆమె రాబోయే ప్రాజెక్టు కూడా ఘన విజయం సాధించాలని ఆశిద్దాం.

మీనాక్షి చౌదరి తన కష్టంతో, పట్టుదలతో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం.



# సినిమా

## రామోజీ ఫిలిం సిటీని మించిన లోకేషన్..



### ఆ గ్రామంలో ఏకంగా 5వేల పాటల షూటింగ్

మేకర్స్ తెరపై కొన్ని సన్నివేశాలని చాలా అందంగా చూపించేందుకు సినిమా రిలీజ్కి ముందే పలు ప్రాంతాలని సెర్చ్ చేస్తారు. తమ కథకి తగ్గట్టు ఏ లోకేషన్లో ఫలానా సన్నివేశాన్ని తీయాలి, ఏ లొకేషన్లో డ్యూయట్స్ తీయాలి, ఏ లొకేషన్లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాలి వంటి వాటిలో ఓ అంచనాకి వస్తారు. అయితే సినిమా షూటింగ్ అంటే దాదాపు మనందరికి గుర్తొచ్చే ప్రాంతాలు ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు. అక్కడి స్టూడియోలు వాటి చుట్టు పక్కన ప్రాంతాలలో మూవీ షూటింగ్ జరుపుకుంటుంది. హైదరాబాద్లో అంటే ఎక్కువగా రామోజీ ఫిలిం సిటీలోనే మూవీ షూటింగ్స్ జరుగుతుంటాయి.అయితే ఒక ఊరు రామోజీ ఫిల్మ్ సిటీనే మించిపోయింది. వందల, వేల షూటింగ్స్ జరిగిన ఆ గ్రామం చాలా మందిని ఎంతగానో ఆకర్షిస్తూ ఉంటుంది. ఆ ఊరు తమిళనాడులో ఉంది. ఎంతో మంది మేకర్స్కి ఆ ఊరు ఫేవరేట్ షూటింగ్ స్పాట్. మరి ఆ ఊరేంటనే కదా మీ డౌట్ పొల్లాచ్చి. అక్కడ దాదాపు 1500కు పైగా సినిమాల షూటింగ్స్ జరిగాయి. 5000 కు పైగా పాటల షూటింగ్స్ కూడా ఆ గ్రామంలో జరిగాయి. ఎంతో అందంగా ఉండే పొల్లాచ్చి సినిమా వాళ్లనే కాకుండా పర్యాటకులని సైతం ఎంతగానో ఆకట్టుకుంటుంది.పొల్లాచ్చిలో చిత్రీకరించిన సినిమాల విషయానికి వస్తే ఇక్కడ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ ఇండస్ట్రీకి చెందిన ఎంతో మంది స్టార్ హీరోల సినిమాల షూటింగ్స్ పొల్లాచ్చిలో జరిగాయి. భారతదేశంలో పొల్లాచ్చి కొబ్బరికి రాజధాని. ఇక్కడ పండే కొబ్బరి బొండాలకు ఎంత డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.. అందమైన ప్రాంతాలు, సుందరంగా కనిపించే తోటలు ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటాయి. అందుకే తమిళనాడులోని పొల్లాచ్చి సినిమా వారికి ఫేవరెట్ షూటింగ్ స్పాట్గా నిలిచింది. మీరు తమిళనాడు వెళ్లినప్పుడు ఒక్కసారి పొల్లాచ్చి వెళ్లి చూడండి, అక్కడి నుండి తిరిగి రావాలని ఎవరికి అనిపించదు. అంత అందంగా ఉంటుంది ఆ ప్రాంతం. దర్శకుడు శంకర్ కూడా చాలా సినిమాల షూటింగ్ లో పొల్చాచ్చిలో జరిపాడు.

## నాకు బ్రేకప్ స్టోరీస్ ఉన్నాయి..

కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. మల్టీ టాలెంటెడ్ ఆర్టిస్ట్గా ఎంతో మంది మనసులు గెలుచుకుంది శృతి. పవన్ కళ్యాణ్ సరసన నటించిన గబ్బర్ సింగ్ సినిమాతో సూపర్ హిట్ అందుకొని ఆ తర్వాత టాలీవుడ్ లో చాలా సినిమా అవకాశాలు దక్కించుకుంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ టాప్ హీరోయిన్గా ఎదిగింది. శృతి హాసన్ సినిమాలతోనే కాదు సోషల్ మీడియాలోను తెగ సందడి చేస్తూ ఉంటుంది. అయితే ఇటీవల శృతి ఎక్కువగా తన బ్రేకప్తో ఎక్కువగా వార్తలలో నిలుస్తుంది. గతంలో మైకెల్ అనే విదేశీ వ్యక్తితో తో బ్రేకప్ అయ్యాక.. బాగా డిస్టర్బ్ అయిన శృతి ఆ తర్వాత శాంతనుతో డేటింగ్ చేస్తుంది. వీళ్ళ లవ్ గురించి బహిరంగంగానే ఎప్పుడో చెప్పేసింది.కాని ఎందుకో ఏమైందో కాని శృతి అతనికి కూడా బ్రేకప్ చెప్పింది. అయితే రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె.. తన రిలేషన్ షిప్స్ పై ఓపెన్ అయ్యింది. ఇలాంటి పని ఎందుకు చేశానా అని తాను బాధపడిన సందర్భాలు లేవని, ఇష్టమైన వారిని మాత్రం కొన్ని సార్లు బాధ పెట్టానని శృతి హాసన్ చెప్పుకొచ్చింది. లైఫ్లో ప్రతి ఒక్కరికీ లవ్ ఫెయిల్యూర్ స్టోరీ ఉంటుంది. మాజీ భాగస్వామి వల్ల మనం ఎన్నో విషయాలు అర్థం చేసుకుంటాం. నాక్కూడా అలాంటి బ్రేకప్ స్టోరీస్ ఉన్నాయి.తాను ఎలాంటి బాధ లేకుండా రిలేషన్ షిప్పు ముగించేస్తానని , తన వరకు నిజాయితీగా ఉంటానని.. అందుకే చాలా మంది తనను ఎన్నో నెంబర్ బాయ్ ఫ్రెండ్ తో ఉన్నావంటూ ట్రోల్ చేస్తూ ఉంటారని శృతి హాసన్ పేర్కొంది. తన విషయంలో అన్ని సార్లు ప్రేమలో ఫెయిల్ అవుతున్నాను అంటే నిజమైన ప్రేమను పొందడంలో ఫెయిల్ అవుతున్నానని అర్థం అంటూ వాపోయింది. జీవితంలో ఇలాంటి పని ఎందుకు చేశానా.. అని బాధపడిన సందర్భాలు ఎక్కువగా లేవని స్పష్టం చేసింది. కానీ కొన్నిసార్లు తనకు ఇష్టమైన వారిని బాధపెట్టానని.. అనుకోకుండా జరిగినప్పటికీ అలా చేయకుండా ఉండాల్సింది అనే భావన ఎప్పటికీ ఉంటుందని పేర్కొంది. వారికి జీవితాంతం క్షమాపణలు చెబుతూనే ఉంటానని శృతి పేర్కొంది.



**Printed, Published and Owned by VELLENKI JAYAPAL REDDY**, Printed at M/s KAKATIYA PRINTERS, H.No: 24-91/72/1, Block No. 29, Plot Nos. 72,73 and 74, Laxminarayana NagarIDA Uppal, Uppal Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 39. Published at H.No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 92,
**Editor: VELLENKI JAYAPALREDDY, Cell: 9133445456,9346984911 RNI NO : TELTEL/2023/84471,**
Website: www.nedudailynews.com, **e-mail: vellenkijayapalreddy@gmail.com.**